RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

నిజం మా నైజం

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com

ఎడిటర్ : చింతల రామకృష్ణ  సంపుటి : 13  సంచిక : 116  బుధవారం, ఆగష్టు 20, 2025,  పేజీలు - 8  వెల : 3/-




# నెహ్రూ దేశాన్ని రెండు సార్లు విభజించారు: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందంవల్ల భారత్‌కు ఒరిగిందేమీ లేదని మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అంగీకరించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. భారతదేశాన్ని నెహ్రూ రెండుసార్లు విభజించారని ఆరోపించారు. ఒకసారి రాడ్‌క్లిఫ్ లైన్‌తో విభజిస్తే, 80 శాతం జలాలు పాకిస్థాన్‌కు ఇస్తూ సింధూ జలాల ఒప్పందంతో రెండోసారి విభజించారని, ఇది రైతు వ్యతిరేక ఒప్పందమని అన్నారు. జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో మంగళవారంనాడు జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మాట్లాడారు.'నెహ్రూ దేశాన్ని ఒకసారి, మళ్లీ మరోసారి విభజించారు. సింధూ జలాల ఒప్పందం కింద 80 శాతం జలాలు పాక్‌కు ఇచ్చారు. ఆ తర్వాత ఈ ఒప్పందం వల్ల భారత్‌కు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదంటూ తన సెక్రటరీ ద్వారా పొరపాటును ఒప్పుకున్నారు' అని మోదీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలకు ఇదే నిదర్శనమని చెప్పారు.కాగా, ఇదే సమావేశంలో ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపీలకు మోదీ పరిచయం చేశారు. ఓబీసీ కమ్యూనిటీ నుంచి వచ్చిన సరళ స్వభావి, నిబద్ధత కలిగిన నేత అని రాధాకృష్ణన్‌ను ప్రశంసించారు. అనంతరం రాధాకృష్ణన్‌ను ప్రధాని, ఎంపీలు సన్మానించారు.

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఎన్డీఏ: సీఎం రేవంత్



హైదరాబాద్, ఆగస్టు19 : ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం హర్షణీయమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది తెలుగు ప్రజల ప్రతిష్టను పెంచే విధంగా తీసుకున్న నిర్ణయమని ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను ఎన్డీఏ కూటమి అపహాస్యం చేస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను ఎన్డీఏ దుర్వినియోగం చేస్తోందని ఫైర్ అయ్యారు.(మంగళవారం) హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్న కూటమి ఒకవైపు, రాజ్యాంగాన్నే రద్దు చేయాలని చూస్తున్న ఎన్డీఏ కూటమి మరోవైపు ఉన్నాయని చెప్పుకొచ్చారు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని కుట్ర చేస్తున్న వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందని ఉద్ఘాటించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి తెలుగు రాష్ట్రాల్లోని అన్ని పార్టీలు మద్దతుగా నిలవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గెలుపునకు చంద్రబాబు, కేసీఆర్, పవన్ కల్యాణ్, జగన్ కృషిచేయాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని సూచించారు. బీసీలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని తెలిపారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని నొక్కిచెప్పారు. ఆత్మప్రబోధానుసారం ఓటు వేయాలని ఎంపీలందరికీ విజ్ఞప్తి చేశారు. ఇది తెలంగాణ వర్సెస్ తమిళనాడు కాదని వెల్లడించారు. రాజ్యాంగాన్ని రక్షించేవారికి, రాజ్యాంగాన్ని గౌరవించనివారికి జరిగే పోరాటమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## 50 మంది వ్యోమగాముల్ని తయారు చేయాలి
# : శుభాంశు శుక్లాతో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌కు వెళ్లి వచ్చిన ఆస్ట్రోనాట్ శుభాంశు శుక్లాతో ప్రధాని మోదీమాట్లాడారు. ఢిల్లీలో ఆ ఇద్దరూ పలు అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసుకున్నారు. యాక్సియం-4 స్పేస్ మిషన్‌కు గ్రూప్ కెప్టెన్ శుక్లా .. పైలెట్‌గా చేశారు. సోమవారం ఆ ఇద్దరూ కాసేపు ముచ్చటించారు. ఆ భేటీకి సంబంధించిన వీడియోను రిలీజ్ చేశారు. అంతరిక్షంలో వాతావరణం భిన్నంగా ఉంటుందని, అక్కడ గురుత్వాకర్షణ ఉండదని శుక్లా అన్నారు. స్పేస్ స్టేషన్‌లో ఫుడ్ చాలా పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. అక్కడ చాలా తక్కువ స్థలం ఉంటుందని, దాని వల్ల కార్గో చాలా ఖరీదుగా మారుతుందని శుక్లా చెప్పారు. మనకు కావాల్సిన ఆహారాన్ని టైట్‌గా ప్యాక్ చేస్తామని, ప్రయోగాలు ఎప్పటికీ జరుగుతూనే ఉంటయాన్నారు. నేను ఎక్కడికి వెళ్లినా, అక్కడ అందరూ సంతోషంగా ఉన్నారని, అంతరిక్ష రంగంలో భారత్ మెరుగైన ప్రదర్శన ఇస్తుందన్న విషయం అందరికీ తెలుసు అని శుక్లా అన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్టు గురించి ఎంతో మంది ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. ఎప్పుడు ఆ మిషన్ జరుగుతుందని ప్రశ్నిస్తున్నారని శుక్లా తెలిపారు. ఎయిర్ ఫోర్స్‌లో తాను చేరినప్పుడు, ఇక తాను చదివేది ఏమీలేదనుకున్నానని, కానీ ఆ తర్వాత చాలా చదువాల్సి వస్తోందన్నారు. టెస్ట్ పైలెట్‌గా మారిన తర్వాత ఈ మిషన్ కోసం ప్రిపేర్ కావాల్సి వచ్చిందన్నారు. తాము వెళ్లిన మిషన్ సక్సెస్ అయ్యిందని, అంత మాత్రాన మిషన్ పూర్తి అయినట్లు కాదు అని శుక్లా తెలిపారు.శుక్లాతో మాట్లాడిన మోదీ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యోమగాముల బృందాన్ని తయారు చేయాలన్నారు. సుమారు 40 నుంచి 50 మంది వ్యోమగాముల బృందాన్ని సంకల్పిస్తున్నట్లు చెప్పారు. తాను బాల్యంలో ఉన్నప్పుడు రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి వెళ్లారని, అప్పుడు ఆస్ట్రోనాట్ కావాలన్న ఆలోచన తనకు కలగలేదని శుక్లా అన్నారు. కానీ స్పేస్ స్టేషన్‌కు వెళ్లి వచ్చిన తర్వాత స్కూల్ పిల్లలతో మూడుసార్లు మాట్లాడానని, ప్రతి ప్రోగ్రామ్‌లో ఎలా తాను ఆస్ట్రోనాట్ కావాలని పిల్లలు అడిగినట్లు శుక్లా చెప్పారు. ఇదే మన దేశానికి పెద్ద సక్సెస్‌గా భావించవచ్చు అన్నారు. ఇప్పుడు ఇది సాధ్యమే అని ఇండియాలో తెలుసు అని, మనకు ఆప్షన్ ఉందని, ఆస్ట్రోనాట్ కావచ్చు అని పిల్లలు అనుకుంటారన్నారు. వీలైనంత మందిని తన స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానని శుక్లా తెలిపారు.స్పేస్ స్టేషన్, గగన్‌యాన్.. ఈ రెండూ అతిపెద్ద ప్రాజెక్టులు అని, వీటి ఏర్పాట్లలో నీ అనుభవం ఉపయుక్తంగా ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు.

## ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా
# సుప్రీంకోర్టు మాజీ జడ్జి



న్యూ ఢిల్లీ : ప్రతిపక్ష ఇండియా కూటమి తరఫున ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి ని ఎంపిక చేశారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధికారికంగా ప్రకటించారు. రంగారెడ్డి జిల్లాలోని ఆకుల మైలారం సుదర్శన్‌రెడ్డి స్వస్థలం. ఆయన వ్యవసాయ కుటుంబంలో పుట్టారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేశారు.జస్టిస్ సుదర్శన్ రెడ్డి నాలుగున్నరేళ్లపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. పదవీ విరమణ తర్వాత యన గోవా లోకాయుక్త ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. గోవా తొలి లోకాయుక్తగా ఆయన గుర్తింపు పొందారు. సుదర్శన్ రెడ్డి 2007 నుంచి 2011 వరకు సుప్రీంకోర్టు జడ్జిగా పనిచేశారు. అంతకుముందు 2005లో గువాహటి హైకోర్టు జడ్జిగా పనిచేశారు.కాగా అధికార ఎన్డీఏ కూటమి ఇప్పటికే తమ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పేరును ఖరారు చేసింది. దాంతో ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్‌తో జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి తలపడనున్నారు.

## రాహుల్‌ను ప్రధానిని చేయడమే
# లక్ష్యంగా పని చేస్తాం



నవడా: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరనే దానిపై ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సంకేతాలిచ్చారు. రాహుల్‌గాంధీ ని ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు కృషి చేస్తాయని చెప్పారు. తేజస్వి ఈ వ్యాఖ్యలు చేసినప్పుడు రాహుల్ గాంధీ ఆయన పక్కనే ఉన్నారు. రాహుల్ చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర' మంగళవారంనాడు బిహార్‌లోని నవడాలో సాగుతోంది. ఈ యాత్రలో తేజస్వి పాల్గొని మాట్లాడారు. 'ఇండియా' కూటమి 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికలకు వెళ్లింది. ప్రధాన మంత్రి అభ్యర్థిత్వంపై అప్పట్లో కూటమి నేతల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రధానమంత్రి అభ్యర్థిగా మల్లికార్జున్ ఖర్గే అయితే మద్దతు ఇవ్వగలమని టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. బీహార్ ప్రజలను ఫూల్స్ చేసేందుకు..నవడా ర్యాలీలో తేజస్వి యాదవ్ మాట్లాడుతూ, ఓట్ల చోరీకి ఎలక్షన్ కమిషన్, బీజేపీ చేతులు కలిపాయని, బిహార్ ప్రజలను ఫూల్స్ చేయాలనుకుంటున్నాయని ఆరోపించారు. ఓటు హక్కును చోరీ చేయాలని బీజేపీ అనుకుంటోందని, ఎస్ఐఆర్ అనేది ఓట్ల దోపిడీ అని, ఇదెంతమాత్రం సాగనీయమని అన్నారు. బిహార్‌లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోకుండా కుట్ర జరుగుతోందని చెప్పారు. నితీష్ కుమార్ సారథ్యంలోని 'పాతబడిన, చిరిగిపోయిన' ప్రభుత్వాన్ని యువత ఇంటికి సాగనంపాలని కోరారు. చినిగిపోయిన వస్తువులను కొత్తవాటితో భర్తీ చేసినట్టే ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు యువత పట్టుదలగా ఉందని చెప్పారు.

# మోదీ అంటే భయమా భక్తా : సీఎం రేవంత్



హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి మరోసారి మోదీ సర్కార్‌పై ఫైర్ అయ్యారు. తెలంగాణకు కేంద్రం యూరియా సరఫరా చేయకుండా ప్రధాని మోదీ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మోదీకి మొదటి నుంచి తెలంగాణపై వివక్షత భావం ఉందని తెలిపారు. రాష్ట్ర రైతాంగానికి అవసరం మేరకు.. యూరియా సరఫరా చేయకుండా.. వివక్ష పూరిత వైఖరి ప్రదర్శిస్తోన్న కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని పార్లమెంట్‌లో రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు ఎండగట్టారని పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలతో.. గొంతు కలిపి పార్లమెంట్‌లో తెలంగాణ రైతుల పక్షాన నిలిచిన ఎంపీ ప్రియాంక గాంధీకి సీఎం ఎక్స్ వేదికగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.రాష్ట్ర రైతాంగ అవసరాల మేరకు యూరియా సరఫరా చేయాలని లేఖల రూపంలో, విజ్ఞప్తుల రూపంలో పదే పదే కోరినా కేంద్రం స్పందించకపోవడం దారుణమని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్త చేశారు. రాష్ట్ర రైతాంగానికి అండగా నిలవాల్సిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మోదీ భజనలో బిజీగా ఉన్నారని విమర్శించారు. మన రైతుల కోసం.. మోదీ సర్కారుపై ఒత్తిడి తెచ్చేందుకు%ౌ% మాతో కలిసి రావాల్సిన.. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో పత్తా లేరని ఎద్దేవా చేశారు. గల్లీలో లొల్లి చేయడానికి ఉత్సాహం చూపే వాళ్లు ఢిల్లీలో మోదీని ప్రశ్నించడానికి ఎందుకు భయపడుతున్నారని రేవంత్ ప్రశ్నించారు. మోదీ అంటే భయమా.. భక్తా..అని సీఎం నిలదీశారు.


# ఉప రాష్ట్రపతి ఎన్నిక
## ఇండియా కూటమి కీలక నిర్ణయం



న్యూఢిల్లీ, ఆగస్టు 19: తమ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ పేరును ఇప్పటికే ఎన్డీయే ప్రకటించింది. ఆయన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొనేందుకు మోదీ ప్రభుత్వంలోని పలువురు కేంద్ర మంత్రులు ఇప్పటికే రంగంలోకి దిగి.. తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వారి ప్రయత్నాలకు ఇండియా కూటమి గండి కొట్టింది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో అభ్యర్థిని బరిలో నిలపాలని ఇండియా నిర్ణయించింది. మంగళవారం న్యూఢిల్లీలో ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాల పార్టీల నేతలు సమావేశమయ్యారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలపాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు ఇండియా కూటమి నుంచి డీఎంకే ఎంపీ తిరుచ్చి శివను రంగంలోకి దింపుతార ంటూ ఊహాగానాలు ఇప్పటికే ఊపందు కున్నాయి. కానీ ఇండియా కూటమి నుంచి బరిలో నిలిచే నేత ఎవరనేది మరికొన్ని గంటల్లో ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

- రాజస్థాన్‌లోని కోటాకు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు మంజూరు.
- రూ. 1,507 కోట్లతో కోటాలో కొత్త ఎయిర్‌పోర్టుకు ఆమోదం.
- కటక్-భువనేశ్వర్ మధ్య 6 లైన్ల రింగ్‌రోడ్డుకు ఆమోదం.
- రింగ్‌రోడ్డుకు రూ. 8,307 కోట్లు మంజూరు చేస్తూ నిర్ణయం.
- ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్.



న్యూఢిల్లీ, ఆగస్టు 19: కేంద్ర మంత్రివర్గం మంగళవారం నాడు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాజస్థాన్‌లోని కోటాకు గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ మంజూరు చేయడం సహా మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది.కేంద్ర కేబినెట్ నిర్ణయాలు..ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాజస్థాన్‌లోని కోటా-బుండి వద్ద గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని రూ. 1507.00 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయడానికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇచ్చిన ప్రతిపాదనను ఆమోదించింది. చంబల్ నది ఒడ్డున ఉన్న కోట.. రాజస్థాన్ పారిశ్రామిక రాజధానిగా గుర్తింపు పొందింది. అంతేకాకుండా, కోట నేషనల్ ఎడ్యుకేషన్ కోచింగ్ హబ్‌గానూ ప్రసిద్ధి చెందింది.అధికారిక ప్రకటన ప్రకారం.. రాజస్థాన్ ప్రభుత్వం 321 మోడల్ విమానాల నిర్వహణకు అనువైన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ అభివృద్ధి కోసం 440.06 హెక్టార్ల భూమిని బదిలీ చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా 20,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 1000 పీక్ అవర్ ప్యాసింజర్లను నిర్వహించగల సామర్థ్యం గల టెర్మినల్ భవనం నిర్మాణం, వార్షికంగా 2 మిలియన్ల మంది ప్రయాణీకుల సామర్థ్యం , 3200 మీటర్ల %ఇ% 45 మీటర్ల రన్‌వే 11/29, %ూ%-321 మోడల్ విమానాల కోసం 7 పార్కింగ్ బేలతో కూడిన ఆప్రాన్, రెండు లింక్ టాక్సీవేలు, కమ్ టెక్నికల్ బ్లాక్, ఫైర్ స్టేషన్, కార్ పార్క్, అనుబంధ పనులు చేపట్టనున్నారు.

# ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఎంపిక.
## పీసీసీ చీఫ్ ఫస్ట్ రియాక్షన్




హైదరాబాద్, ఆగస్టు 19: తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన యూరియా ఇవ్వకుండా కేంద్రం దోబూచులాడుతోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. తద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని బద్నాం చేసే ప్రయత్నం కేంద్రం ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన యూరియా వాటాపై హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వేదికగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై కేంద్రం సవితి తల్లిలా వ్యవహరిస్తోందంటూ ఆరోపించారు.తెలంగాణకు రావాల్సిన యూరియా కోసం తమ పార్టీ ఎంపీలు పార్లమెంట్ వద్ద ఆందోళన చేస్తున్నారన్నారు. పార్టీ ఎంపీల ఆందోళనకు ప్రియాంక గాంధీ కూడా మద్దతు పలికారని గుర్తు చేశారు. యూరియా కోసం రైతులు రహదారి పైకి వచ్చి ఆందోళన చేస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన యూరియా వాటా ఇవ్వాల్సిందిగా ఈ సందర్భంగా కేంద్రానికి ఆయన విజ్ఞప్తి చేశారు.ఇదే అంశంపై ఇప్పటికే తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం కేంద్రానికి లేఖలు రాశారని గుర్తు చేశారు. కేంద్రం వివక్షత చూపడం.. ప్రజాస్వామ్యానికి అంత మంచిది కాదని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అభిప్రాయపడ్డారు.ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డిని ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. అయితే జస్టిస్ సుదర్శన్ రెడ్డి నీతికి నిజాయితీకి ప్రతీక అని పీసీసీ చీఫ్ అభివర్ణించారు. అలాంటి వ్యక్తిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

# హౌసింగ్ స్కీమ్‌లో అవినీ.
# మంత్రి ఉత్తమ్ చర్యలు



హుజుర్‌నగర్ ఆగస్టు19: హుజుర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని జానపహాడ్ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో జరిగిన అవకతవకలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీరియస్‌గా స్పందించారు. అవకతవకల విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే సదరు కార్యదర్శి వెంకటయ్యను సస్పెండ్ చేయడంతో పాటు ఏసీబీ కేసు నమోదు చేయాలంటూ జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. తక్షణమే రంగంలోకి దిగిన జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్ సదరు కార్యదర్శి వెంకటయ్యను సస్పెండ్ చేయడంతో పాటు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఒకటి, రెండు రోజుల్లో వెంకటయ్య అరెస్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# హీరో విజయ్ ధీమా
## అసెంబ్లీ ఎన్నికల్లో విజయం మాదే



చెన్నై: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తమదేనని టీవీకే అధ్యక్షుడు, సినీ హీరో విజయ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి ప్రజలతో కలిసిపోయి, వారితో మమేకమైన పార్టీగా వచ్చే ఎన్నికల్లో నిరూపించబోతున్నట్టు విజయ్ వెల్లడించారు. మన లక్ష్యాన్ని చేరుకునేందుకు, మన కలల్ని నెరవేర్చుకునేందుకు కొన్ని నెలల సమయం మాత్రమే ఉందన్నారు. 1967, 1977లో వచ్చిన ఎన్నికల ఫలితాలను ఎన్నికలు అనే రాజకీయ యుద్ధంలో గెలుస్తామని, అంతా మంచే జరుగుతుందని, విజయం తథ్యమని విజయ్ ధీమా వ్యక్తం చేశారు.

# వేదమంత్రాల నడుమ నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవం

**- భక్తి శ్రద్ధల మధ్య నాగదేవతల విగ్రహానికి ఘనంగా పూజలు**

**అమీన్ పూర్,వాస్తవ తెలంగాణ న్యూస్**
సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పట్టణ పరిధిలో,నాగదేవతల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం కన్నుల, పండుగ నిర్వహించారు. చదువు మల్లేష్ ఆధ్వర్యంలో ,నాగదేవతల విగ్రహాల, ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు.మంగళ వాద్యాలు, భక్తుల హర్షద్వానాలతో, విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు.ఈ సందర్భంగా చదువు మల్లేష్ మాట్లాడుతూ... నాగదేవతల కృపతో అమీన్పూర్ గ్రామానికి, శాంతి, ఐశ్వర్యాలు, కలగాలని కోరుకున్నట్టు ఆయన



తెలిపారు. భక్తి గానాలతో, నాగదేవతల విగ్రహ ప్రతిష్ట వేడుక, కన్నుల పండుగ నిర్వహించాము, అని ఆయన తెలిపారు. అమీన్ పూర్ పట్టణనికి చెందిన , స్థానిక ప్రజా, ప్రతినిధులు, గ్రామ పెద్దలు ,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనీ, నాగదేవతల ఆశీర్వాదం, పొంది, తీర్థప్రసాదాలు స్వీకరించారు.విగ్రహ ప్రతిష్ట అనంతరం అన్నదానం నిర్వహించి భక్తులకు, మహా ప్రసాదం పంపిణీ చేసా ం, అని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు,భక్తులుపెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:**
నియోజకవర్గంలోని ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని. ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ పటాన్చెరు వారి ఆధ్వర్యంలో పటాన్చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఫోటోగ్రాఫర్లకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఫోటోగ్రఫీ రంగంలో వస్తున్న ఆధునిక



సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే మనుగడ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అనిల్, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, మాజీ అధ్యక్షులు కృష్ణ యాదవ్,



ప్రతినిధులు శంకర్, మహిపాల్ రెడ్డి, పవన్, సునీల్, అనిల్, సాగర్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

# యాదవ సంఘం ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:**
పటాన్చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ లో నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న యాదవ సంఘం కళ్యాణ మండపం పనులు తుది దశకు చేరుకున్నాయని త్వరితగతిన పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొని వస్తామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతం ఫాల్ సీలింగ్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఫంక్షన్ హాళ్లు నిర్మించాలన్న లక్ష్యంతో నియోజకవర్గం వ్యాప్తంగా కళ్యాణ మండపాలు నిర్మిస్తున్నామని తెలిపారు. పనులు త్వరితగదన పూర్తి చేయాలని జిహెచ్ఎంసి ఏఈ శివకుమార్ ను ఆదేశించారు..





# ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆద్వర్యంలో రాంపల్లి డబుల్ బెడ్ రూం వారికి జాబ్ మేళా



**కీసర మండల వాస్తవ తెలంగాణ న్యూస్/**
మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ రాంపల్లి డబుల్ బెడ్రూం 6240 కుటుంబ సభ్యులకు, ఆర్ఆర్ఆర్ టి ఆర్ వి సోషల్ వెల్ఫేర్ ఫౌండేషన్ రాంపల్లి వారికి మెడ్చల్ జిల్లా ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్ సహకారం తో నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మా సొసైటీలో



జరిగిన జాబ్ మేళా విజయవంతంగా పూర్తయింది.ఈ కార్యక్రమంలో మొత్తం 25 కంపెనీలు పాల్గొని 850ం మంది అభ్యర్థులు ఉద్యోగావకాశాల కోసం హాజరయ్యారు.ఈ జాబ్ మేళాలో సూర్యా టేక్ సెల్యూషన్ 600 మందికి పైగా ఎంపిక




అయ్యారు, అలాగే మరో 200 మంది ఇతర కంపెనీలలో సెలెక్ట్ అయ్యారు.ఈ కార్యక్రమానికి మద్దతు ఇచ్చిన రాధికా మేడమ్ కి మరియు నాగారం లోని మున్సిపాలిటీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి కి మా 52వ బ్లాక్ ఇన్‌చార్జ్ కి, అన్నాచెల్లెమ్మలందరికి, సహకారం అందించిన ఇన్‌చార్జ్ కి"ఈ జాబ్ మేళాకు సహకారం అందించిన పోచారం ఎస్ ఐ విజయ్ భాస్కర్ రెడ్డి కి మరియు డిపార్ట్మెంట్ కి హృదయపూర్వకంగా రాంపల్లి వాసులు ధన్యవాదాలు తెలిపారు.

# మండల స్థాయిలో ఉల్లాస్ కార్యక్రమం పై శిక్షణా



**- ఎన్.శంకర్,మండల విద్యాధికారి,**

**సదాశివపేట వాస్తవ తెలంగాణన్యూస్**
సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంమంగళవారం రోజున ప్రతి గ్రామ పంచాయతీలో గల ప్రాథమిక పాఠశాల హెచ్.ఎం మరియు స్వయం సహాయక సంఘం లీడర్ లకు ఉల్లాస్ కార్యక్రమం పై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.ప్రతి మనిషి జీవితంలో ప్రాథమిక విద్య అత్యంత కీలకమైనదని, ఆధునిక



సమాజంలో మనిషి మనుగడ సుఖంగా ఉండాలి అంటే అందరూ చదువుకొని ఉండాలని, ప్రతి గ్రామంలో 15 సంవత్సరాల పైబడి,ఇంతవరకు చదువుకోని వారు చదువుకోవడం కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం ఉల్లాస్ అని తెలిపారు.ఉల్లాస్ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు,స్వయం సహాయక సంఘాలు లీడర్,పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, స్వచ్ఛంద కార్యకర్తలు భాగస్వాములై ఉండి ప్రతి గ్రామం ని ఒక యూనిట్ గా తీసుకొని స్వచ్ఛంద వాలంటీర్ ల సహాయం తో నిరక్షరాస్యులని అక్షరాస్యులుగా తయారు చేయడం, చదివించడం మరియు వారు సర్టిఫికెట్ పొందే అవకాశం జరుగుతుందని తద్వారా పై




చదువులు కొనసాగించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకోసం సామాజిక చైతన్య కేంద్రం మరియు అక్షరాస్యత కేంద్రాల ను నిర్వహణ కమిటీల ఆధ్వర్యం లో ఏర్పాటు చేయడం జరుగుతుంది.ఉల్లాస్ కార్యక్రమాన్ని అందరం కలిసి విజయవంతం చేద్దామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఓపెన్ స్కూల్ సొసైటీ కోఆర్డినేటర్ వెంకట స్వామి వెంకటేశం డిపిఎం ఫైనాన్స్, మండల ఏ.పి.యం శ్రీనివాసరావు ఆర్పీలు సురేష్ మహేష్ హెచ్ ఎంలు టీచర్స్ ద్వాక్రా సంఘం లీడర్స్ ఎంఆర్సి స్టాఫ్ మరియు సిఆర్పిలు పాల్గొన్నారు

# జిన్నారంలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం





**జిన్నారం,వాస్తవ తెలంగాణ న్యూస్:** జిన్నారం మున్సిపల్ కేంద్రంలో 185వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సిఐ నయీముద్దీన్ ఎస్ఐ హనుమంతులు ముఖ్య అతిథులుగా హాజరై ఫోటోగ్రాఫర్లతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా ఫోటోగ్రఫీ రంగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. పదిలమైన గుర్తులను ఎప్పటికీ మర్చిపోకుండా గుర్తు చేసేవే ఫోటోలని కొనియాడారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డ్యాగ్యూరే ఫోటోగ్రఫీ దినోత్సవానికి మూల కారకుడని కొనియాడారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు పోలీస్ అధికారులను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ సభ్యులకు ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫోటోగ్రఫీ అసోసియేషన్ సభ్యులు బాలా గౌడ్ బిక్షపతి గౌడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలు: ప్రజలు అప్రమత్తంగా ఉండాలి -కలెక్టర్

**సంగారెడ్డి,వాస్తవ తెలంగాణ న్యూస్:**జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం తెలిపారు. చెరువులు, వాగులు అటువైపు వెళ్లవద్దని, రోడ్లపైకి వర్షం నీరు చేరడంతో కొన్ని ప్రాంతాలకు రాకపోకలు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు సాధ్యమైనంత వరకు ఇంటికే పరిమితం కావాలని సూచించారు.



# చినుకు పడితే అంతే చిత్తడిగా మారిన రెడ్డి కాలనీ రోడ్డు





**శంకర్పల్లి న్యూస్ వాస్తవ తెలంగాణ** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని హైదరాబాద్ రోడ్డు పక్కన గల రెడ్డి కాలనీ రోడ్డు వర్షానికి బురదతో నిండి చిత్తడిగా మారింది. రోడ్డంతా గుంతలుగా ఏర్పడి బురదగా మారడంతో అపార్ట్మెంట్ వాసులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీకి వెళ్లే ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు, మహిళలకు ఇక్కట్లు తప్పడం లేదు. నిత్యావసర వస్తువులు తీసుకురావడానికి బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఓ ప్రైవేటు పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు కూడా నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నారు. దీంతో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ నరకకూపంగా మారుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, నాయకులు స్పందించి, వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టి సమస్యను తీర్చాలని కాలనీవాసులు మొర పెట్టుకుంటున్నారు.

# కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ షాకింగ్ కామెంట్స్



హైదరాబాద్, ఆగస్టు 19: తెలంగాణ కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన కామెంట్స్ చేశారు. ప్రభుత్వ పనితీరును విమర్శిస్తూ.. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేశారు. కాంగ్రెస్ సర్కార్‌కు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వడం చేతకాదు.. సుంకిశాల రిటైనింగ్ వాల్ సరిగ్గా కట్టించే తెలివి లేదు.. చివరికి ఓ చెక్ డ్యామ్ కూడా నిర్మించలేని కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టుపై మాత్రం బురద జల్లుతారని, ఇది సిగ్గుచేటు అంటూ విమర్శలు గుప్పించారు. మహబూబ్‌నగర్‌లోని అడ్డాకుల మండలం గుడిబండ పెద్ద వాగుపై కాంగ్రెస్ కాంట్రాక్టర్ నిర్మించిన చెక్ డ్యామ్ రెండునెలల్లోనే ఎందుకు కొట్టుకుపోయిందో సీఎం రేవంత్ సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నాసిరకం పనులు చేసి రైతుల పొలాలు, మోటర్ పైప్ లైన్లు, చివరికి ట్రాన్స్‌ఫార్మర్ కూడా కొట్టుకుపోయే దుస్థితికి కారణమైన ప్రతి ఒక్కరిపై సర్కారు చర్య తీసుకుని బాధితులను ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల మాట దేవుడెరుగు చివరికి ఒక్క ఇటుక కూడా సరిగా పేర్చలేని దద్దమ్మ ప్రభుత్వం అని.. కాంగ్రెస్ సర్కారు ముక్కు నేలకు రాసి మరోసారి కాళేశ్వరం ప్రాజెక్టుపై నోరు పారేసుకోమని లెంపలేసుకోవాలంటూ కేటీఆర్ ఘాటైన వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. కేటీఆర్ పోస్ట్ యథావిధిగా.. టన్నెల్ తొవ్వడం చేతకాదు.. సుంకిశాల రిటైనింగ్ వాల్ సరిగ్గా కట్టించే తెలివిలేదు.. చివరికి ఓ చెక్ డ్యామ్ ను కూడా నిర్మించలేని కాంగ్రెస్ సన్నాసులు కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద జల్లడం సిగ్గుచేటు.. మహబూబ్‌నగర్ లోని అడ్డాకుల మండలం గుడిబండ పెద్ద వాగుపై కాంగ్రెస్ కాంట్రాక్టర్ నిర్మించిన చెక్ డ్యామ్ రెండునెలల్లోనే ఎందుకు కొట్టుకుపోయిందో సీఎం రేవంత్ సమాధానం చెప్పాలి. నాసిరకం పనులు చేసి రైతుల పొలాలు, మోటర్ పైప్ లైన్లు, చివరికి ట్రాన్స్‌ఫార్మర్ కూడా కొట్టుకుపోయే దుస్థితికి కారణమైన ప్రతి ఒక్కరిపై సర్కారు చర్య తీసుకుని బాధితులను ఆదుకోవాలి. ప్రాజెక్టుల మాట దేవుడెరుగు చివరికి ఒక్క ఇటుక కూడా సరిగా పేర్చలేని ఈ దద్దమ్మ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సర్కారు ముక్కు నేలకు రాసి మరోసారి కాళేశ్వరం ప్రాజెక్టుపై నోరు పారేసుకోమని లెంపలేసుకోవాలి.' అని ఎక్స్‌లో కేటీఆర్ పేర్కొన్నారు.

# కూకట్‌పల్లి బాలిక హత్య కేసులో కీలక పరిణామం



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సంచలన సృష్టించిన కూకట్‌పల్లి మైనర్ బాలిక సహస్ర మర్డర్ కేసులో కీలక పురోగతి చోటుచేసుకుంది. ఒక అనుమాతుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాలిక ఉంటున్న బిల్డింగ్‌లోనే అద్దెకు ఉంటున్న సంజయ్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. బాలిక సహస్ర హత్య తరువాత సంజయ్ అక్కడకక్కడే అనుమానాస్పదంగా తిరిగినట్లు పోలీసులు తెలిపారు. ఆ అనుమానంతో సంజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటరిగా ఉన్న 11 ఏళ్ల బాలిక సహస్రని గుర్తుతెలియని వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. బాలిక గొంతుకోసి.. ఆపై కడుపులో పొడిచి కిరాతకంగా చంపేశాడు. అయితే ఈ కేసు దర్యాప్తులో భాగంగా చుట్టుపక్కల ఉన్న వందల సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. దుండగుడు ఇంట్లో చొరబడి బాలికపై లైంగిక దాడికి పాల్పడేందుకు ప్రయత్నించి ఉంటాడని.. తప్పించుకోవడానికి ప్రయత్నించిన బాలిక ప్రతిఘటించడంతోనే నిందితుడు ఈ దారుణానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రస్తుతం యువత మైండ్ సెట్ మారాలి : డాక్టర్ జి.సతీష్‌రెడ్డి



హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 19 : ప్రస్తుతం యువత మైండ్ సెట్ మారాల్సిన అవసరం ఉందని, నా ఆవిష్కరణ ఈ దేశానికి ఉపయోగపడేలా ఉండాలనే మైండ్ సెట్ రావాలి.. ప్రపంచ సాంకేతికతో పోటీపడే మనస్తత్వం, ఆవిష్కరణలో కొత్తదనం, ఏఐ, ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, క్వాంటం టెక్నాలజీ లాంటి ఏరియాలు అధ్యయనం, పరిశోధనకు యువతలో రావాలని డీఆర్డీవో పూర్వపు చైర్మన్ భారత ప్రభుత్వ మినిస్ట్రీ అఫ్ డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు కాకతీయ యూనివర్సిటీ సెనెట్‌హాల్‌లో 'తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ అట్టహాసంగా ప్రారంభమైంది. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సతీష్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. 'ఇన్నోవేటివ్ స్కిల్స్??ఫర్ ఎంపవర్‌మెంట్ సైన్స్??అండ్ టెక్నాలజీ ఫర్ ట్రాన్స్??ఫార్మింగ్ యంగ్ ఇండియా' థీమ్‌తో సైన్స్?? కాంగ్రెస్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు, యువత నూతన ఆవిష్కరణలు భారతదేశానికి ఆదర్శమని, 4.34 కోట్ల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఈ సంఖ్య కొన్ని దేశాల జనాభా కంటే ఎక్కువ అన్నారు.భారతీయ యువత ఎక్కువ మంది ప్రపంచం వ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని, వేల ఇంజినీరింగ్ విద్యాసంస్థలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. 1.5 మిలియన్ మంది దేశం నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నారని, 90 శాతం మంది ఉద్యోగాలు పొందుతున్నారన్నారు. గ్రామీణ, కుటుంబ నేపథ్యం అనేది ముఖ్యం కాదు ఆలోచన సరళి ముఖ్యమన్నారు. ప్రపంచానికి భారత్ అవసరం ఉందని, తెలంగాణ రాష్ట్రంలో కాకతీయుల పేరుతో ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయం గొప్ప గొప్ప వ్యక్తులను అందించిందన్నారు. యూనివర్సిటీకి రావటం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి,తెలంగాణ అకాడమీ అఫ్ సైన్స్?? అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్.మోహనరావు,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం,హైదరాబాద్ సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ కే. నందుకూరి ,డాక్టర్ కే.సుజాత తదితరులు పాల్గొన్నారు.

# పండగలకు భారీ బందోబస్తు

**- అధికారుల సమీక్షా సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు**



హైదరాబాద్: వినాయక చవితి, మిలాద్ ఉల్ నబీ పండగల సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబుఅధికారులను ఆదేశించారు. కమిషర్ కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసే గణేశ్ మండపాల వద్ద భద్రత, బందోబస్తు, ఏర్పాట్లపై సమీక్షించారు.గణేష్ ఉత్సవాల సమయంలోనే మిలాద్ ఉన్ నబీ పండగ వస్తుందని, ఈ సమయంలో నిర్వహించే ర్యాలీల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేశ్ మండపాల వద్ద విద్యుత్ వంటి ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను కోరారు.

# రేవంత్‌రెడ్డి నిద్రలో కూడా కేసీఆర్‌నే కలవరిస్తున్నరు : శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి నిద్రలో కూడా కేసీఆర్‌నే కలవరిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వీ శ్రీనివాస్ గౌడ్ ఎద్దేవా చేశారు. సోమవారం సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వృత్తి కులాలకు ఏవైనా వరాలు ప్రకటిస్తారని అంతా ఆశించారని, పాపన్న గురించి కొన్ని మంచి మాటలు మాట్లాడతారని అనుకున్నామని, కానీ అలా జరగలేదని అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు.'సీఎం రేవంత్ ఎక్కడకు వెళ్లినా కేసీఆర్‌ను తిట్టడమే ఎజెండాగా పెట్టుకున్నారు. రాత్రి నిద్రలో కూడా సీఎం రేవంత్ కేసీఆర్‌నే కలవరిస్తున్నారు. ప్రతి దానికి కేసీఆర్ కారణం అనడం తప్ప రేవంత్ చేసిన మంచి పని ఏదీ లేదు. ఎన్నికల్లో గౌడ సోదరులకు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చింది. ఆ హామీల అమలు గురించి మాట్లాడకుండా రేవంత్ వేరే విషయాలు మాట్లాడుతున్నారు. ఎన్నికలప్పుడూ అబద్ధాలే, ఇప్పుడూ అబద్ధాలేనా..?' అని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. 'కేసీఆర్ యాభై శాతంలోపు రిజర్వేషన్లకు చట్టం తెచ్చారని రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. కానీ కేసీఆర్ 62 శాతం రిజర్వేషన్ల కోసం ప్రయత్నించారు. సుప్రీంకోర్టుకు వెళ్లి దాన్ని అడ్డుకున్నది కాంగ్రెస్ నేతలే. కాంగ్రెస్ నేతలు స్వప్నారెడ్డి, గోపాల్ రెడ్డి సుప్రీంకోర్టుకు వెళ్లి రిజర్వేషన్లకు యాభై శాతం క్యాప్ విధించేందుకు కారణమయ్యారు. రిజర్వేషన్ల క్యాప్‌కు కాంగ్రెస్ నేతలు కారణం కాదని సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేతలైన రాహుల్‌గాంధీ, సోనియాగాంధీల మీద ఒట్టేసి చెప్పగలరా..? అని మాజీ మంత్రి నిలదీశారు.'రేవంత్ అబద్దాలను నమ్మేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. 20 నెలల్లో 700 మంది గీత కార్మికులు వివిధ ప్రమాదాల్లో మరణించారు. వారికి ఎక్స్‌గ్రేషియా కూడా చెల్లించడం లేదు. వైన్ షాపుల్లో గౌడ సోదరులకు 25 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఇవ్వలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీనే. ఆ హామీని అమలు చేసే దమ్ములేక కేసీఆర్‌పై నెపం నెడుతున్నారు. కులవృత్తులకు కేసీఆర్ హయాంలో అమలైన పథకాలను ఇపుడు తుంగలో తొక్కారు' అని ఆరోపించారు.' సర్వాయి పాపన్న పాలించిన ప్రాంతాలను మైనింగ్‌కు అప్పజెప్పామని రేవంత్ నిరాధార ఆరోపణ చేశారు. పాపన్న పాలించిన ప్రాంతాలను పురావస్తు శాఖకు అప్పగిస్తూ జీవో ఇచ్చింది కేసీఆర్ పాలనలోనే. రేవంత్ హయాంలోనే పాపన్న పాలించిన ప్రాంతాలను మైనింగ్‌కు ఇచ్చారు. ఆ మైనింగ్‌ను కాంగ్రెస్ నేతలకే అప్పగించారు. జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెడతామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటివరకు పెట్టలేదు' అని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు.'పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డిని రేవంత్ గౌడ్ అని సంబోధించిన విషయాన్ని శ్రీనివాస్ గౌడ్ ప్రస్తావించారు. కల్తీ కల్లు పేరుతో గౌడ సోదరులను జైల్లో పెట్టినందుకు పీసీసీ చీఫ్ సీఎం రేవంత్‌ను రేవంత్ గౌడ్ అని పిలిచారా..? గౌడ సోదరులకు ఇచ్చిన ఏ హామీని కూడా అమలు చేయనందుకు రేవంత్ రెడ్డి రేవంత్ గౌడ్ అయ్యారా..' అని మండిపడ్డారు' బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం తెచ్చి రేవంత్ రెడ్డి తన చిత్తశుద్ధిని చాటుకోవాలి. అబద్దాలు తగ్గించి హామీల అమలుపై దృష్టి సారించాలి. మంచి పనులకు క్రెడిట్ తీసుకుని, చెడ్డ పనులకు కేసీఆర్ కారణమంటే ఊరుకునేది లేదు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి' అని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. ఈ ప్రెస్‌మీట్‌లో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, బీఆర్ఎస్ నేత గౌతం ప్రసాద్ కూడా పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి : తేలప్రోలు రాధాకృష్ణ



మధిర, ఆగస్టు 19 : ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కరం కోసం ఈ నెల 25న చేపట్టే ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు తేలప్రోలు రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం మధిరలో ఆశావర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ ఆస్పత్రి ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%8% ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు అండగా నిలవాలని కోరారు.

# హైదరాబాద్ లోకి కొత్త రకం గంజాయి - కిలో ధర ఏకంగా రూ.కోటి



హైదరాబాద్: ఒక్క గ్రాము రూ.10 వేలు. ఈ లెక్కన కిలో అయితే ఏకంగా రూ.కోటి మరి. ఇదేదో బంగారం, అంతకంటే ఖరీదైన వస్తువు విలువ అనుకుంటున్నారా కాదు. విదేశాల నుంచి హైదరాబాద్ నగరానికి అక్రమంగా వస్తున్న కొత్త రకం గంజాయి ధర. రాజధానిలో ఇప్పటివరకూ గంజాయి, డ్రగ్స్ పట్టుబడుతుండగా కొత్తగా హైడ్రోపోనిక్ గంజాయి నార్కోటిక్స్ బ్యూరో వంటి దర్యాప్తు సంస్థలకు చిక్కుతోంది. మత్తు పదార్థాలకు పెరుగుతున్న డిమాండ్‌తో అంతర్జాతీయ డ్రగ్ ముఠాలు ఈ మత్తు పదార్థాన్ని గుట్టుగా నగరంలోకి ఎలాగోలా చేరవేస్తున్నాయి.నెల రోజుల్లోనే రూ. 53 కోట్ల గంజాయి స్వాధీనం : ఇప్పటికే ఆంధ్రా- ఒడిశా (ఏఓబీ) సరిహద్దులు, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి గంజాయి, ముంబయి, గోవా, బెంగళూరు నుంచి డ్రగ్స్ రవాణా జరు గుతుండగా ఏకంగా విదేశాల నుంచి ప్రత్యేకంగా గంజాయి రావడం పోలీసులకు కొంత ఆందోళన కలిగిస్తోంది. కేవలం నెల రోజుల వ్యవధిలో శంషాబాద్ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలో రూ.53 కోట్ల విలువైన గంజాయిని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకోవడం రికార్డు. తనిఖీలను దాటుకుని వినియోగదారులకు చేరుతున్న సరకు అంతకు రెట్టింపు ఉంటుందని పోలీసు ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. హైడ్రోపోనిక్ గంజాయి అంటే : గంజాయి సరఫరాదారులు సాధారణంగా ఆ మొక్కల్ని మారుమూల ప్రాంతాల్లో ఎవరికీ తెలియకుండా నేలపై సాగు చేస్తుంటారు. పంట చేతికి రావడానికి కనీసం 4 నెలలు, అంతకంటే ఎక్కువ సమయం పడుతుంది. అయితే ఇక్కడ హైడ్రోపోనిక్ గంజాయిని మట్టికి బదులు ప్రయోగశాలల్లో (ల్యాబ్) పెంచుతారు. ఎవరికీ తెలియని రహస్య ప్రాంతాల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేసి, ఉష్ణోగ్రతను కంట్రోల్? చేసే విధానంలో సూక్ష్మ పోషకాలున్న ద్రవ పదార్థాలను మొక్కలకు అందిస్తుంటారుమత్తు శాతం ఎక్కువ : దీనివల్ల గంజాయి మొక్క అనుకున్న దాని కంటే వేగంగా పెరిగి పంట చేతికొస్తుంది. ప్రత్యేక పద్ధతుల్లో పోషకాలు అందించడం ద్వారా ఇందులో మత్తు శాతం సాధారణం కన్నా ఎక్కువగా ఉంటుంది. మాములు గంజాయితో పోలిస్తే హైడ్రోపోనిక్ గంజాయిలో 30 శాతం మత్తు అధికంగా, కొకైన్‌తో సమానంగా ఉంటుందని కొంతమంది పోలీసులు చెబుతున్నారు.విదేశాల నుంచి దిగుమతి : ఈ కొత్త రకం మత్తు పదార్థం విదేశాల నుంచి అంటే ముఖ్యంగా థాయ్‌లాండ్ దేశం నుంచి వస్తోంది. ఇటీవల రెండుసార్లు పట్టుబడ్డ సరకు అక్కడి నుంచే వచ్చినట్లు పోలీసు అధికారులు గుర్తించారు. కొన్ని దేశాల్లో గంజాయి సాగుపై నిషేధం లేకపోవడంతో స్మగ్లింగ్ ముఠాలు దీన్ని ఆసరా చేసుకుని ముఖ్యంగా మహిళలతో భారత్‌కు రవాణా చేయిస్తున్నాయి.ఇటీవల పట్టుబడిన ఉదంతాలు30 జులై 2025 : శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అనుమానాస్పదంగా కనిపించిన ఓ మహిళను పోలీసులు అదుపులోకి తీసుకుని బ్యాగుల్ని తనిఖీ చేయగా, ఏకంగా 40 కిలోల గంజాయి సరకు పట్టుబడింది.12 ఆగస్టు 2025 : విమానాశ్రయంలో ప్రయాణికురాలి లగేజీని చెక్? చేయగా రూ.13 కోట్ల విలువైన 13 కిలోల సరకు చూసి పోలీసులు ఆశ్చర్యపోయారు. దీన్ని థాయ్?లాండ్? దేశం రాజధాని బ్యాంకాక్ నుంచి తీసుకొస్తున్నట్లు గుర్తించారు.

# రూ.15 వేలకు ఆశపడి

**- ఏసీబీకి పట్టుబడి వికారాబాద్ మున్సిపల్ అధికారి అవినీతి బాగోతం**



వికారాబాద్ : వేలకు వేల రూపాయల జీతం పొందుతూ రూ.15 వేలు లంచానికి ఆశపడిన ఓ మున్సిపల్ అధికారి ఏసీబీ చిక్కాడు. వికారాబాద్ జిల్లాతాండూరు మునిసిపల్ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు మంగళవారం దాడి చేశారు. ఈ రోజు తాండూరు మునిసిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో రెవెన్యూ అధికారి(ఆర్ఓ)గా విధులు నిర్వర్తిస్తున్న రమేష్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.గత మునిసిపల్ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కౌన్సిలర్ గా పోటీ చేసిన ఇర్షాద్ తన వార్డు పరిధిలో ఒక ఇంటికి నెంబర్ కేటాయించాలని ఆర్ఓ రమేష్ ను ఆశ్రయించారు. ఒక ఇంటికి నెంబర్ కేటాయించేందుకు రూ.20 వేలు ఇవ్వాలని వికారాబాద్ మునిసిపల్ ఆర్ఓ రమేష్డిమాండ్ చేశారు. ఇందులో రూ.15 వేలు లంచంగా ఇస్తానని బాధితుడు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ మేరకు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.వారి సూచన మేరకు తాండూరు మునిసిపల్ కార్యాలయం లో రమేష్‌కు బాధితుడు లంచం ఇస్తుండగా అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అయితే ఏసీబీ దాడుల సమాచారం తెలిసిన వెంటనే కార్యాలయంలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న అధికారులు..సిబ్బంది క్షణాల్లో అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు. ఏసీబీకి చిక్కిన రమేష్ వచ్చే ఏడాది జూన్ లో ఉద్యోగో విరమణ చేయాల్సి ఉంది. అంతలోనే ఏసీబీకి పట్టుబడడం గమనార్హం. రెండేళ్ల క్రితం తాండూరు సబ్ రిజిస్ట్రార్ ను కూడా ఇర్షాద్ ఏసీబీకి పట్టించారు

# రెండు రోజులు మూడు ఘటనలు కరెంటు షాక్‌తో ఎనిమిది మంది మృతి



హైదరాబాద్: పండుగల వేళ హైదరాబాద్‌లో వరుసగా విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రెండు రోజుల్లో మూడు కరెంట్ షాక్‌తో ఎనిమిది మంది మరణించగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నది. కృష్ణాష్టమి సందర్భంగా ఆదివారం రాత్రి రామంతాపూర్‌లోని గోఖుల్‌నగర్‌లో శ్రీకృష్ణుని రథోత్సవం నిర్వహించారు. ఈ క్రమంలో విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే ఐదుగురు మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడగా, వారిలో ఒకరు గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ చనిపోయారు. దీంతో రామంతాపూర్ ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు పెరిగింది.మంగళవారం చాంద్రాయణగుట్ట బండ్లగూడలో కరెంట్ షాక్‌తో ఇద్దరు యువకులు.. ధోని (21), వికాస్ (20) మరణించారు. చంద్రాయణగుట్ట నుంచి పురానాపుల్‌కు 22 అడుగుల వినాయకుడి విగ్రహాన్ని తీసుకొని వెళ్తున్నారు. ఈ క్రమంలో విగ్రహానికి కరెంటు వైరు తగలడంతో దానిని కర్రతో పైకి లేపడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో విద్యుత్ షాక్ కొట్టడంతో ఇద్దరు మరణించారు. వీరితో వెంట ఉన్న మరో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఒవైసీ దవాఖానకు తరలించారు.ఇక అంబర్‌పేటలో వినాయకుడి మండపానికి పందిరి వేసే క్రమంలో కరెంట్ తీగలను కట్టెతో పైకి లేపుతుండగా.. షాక్ తగిలి రామ్ చరణ్ అనే వ్యక్తి కందపడిపోయాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని సమీపంలోని దవాఖానకు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఇలా వరుసగా రెండు రోజుల్లో మూడు విద్యుత్ షాక్ ఘటనలు సంభవించడం, 8 మంది మరణించడం పట్ల నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్ల వద్దని విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు సూచించారు. వర్షాలు పడే సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

# భూ నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం : ఎమ్మెల్యే బాలు నాయక్



చందంపేట (దేవరకొండ) : భూ నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పెండ్లిపాకల కెనాల్‌లో ముంపునకు గురవుతున్న రైతులకు ప్రభుత్వం నుంచి మంజూరైన నష్ట పరిహారం చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల కళ్లల్లో ఆనందం చూసేందుకే ఈ ప్రాజెక్ట్ చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు ఈ ప్రాజెక్ట్ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలా, ఇరిగేషన్ ఈఈ నెహ్రూ, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బుజ్జి లచ్చిరాం నాయక్ పాల్గొన్నారు

# వైసీపీ నేతలకు హోంమంత్రి వార్నింగ్

**అమరావతి, ఆగస్టు 19:** వైసీపీ నేతల తీరుపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి టీవీ, పేపర్‌లో అవాస్తవాలను వాస్తవాలుగా ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. 14 నెలల కాలంలోనే అనేక సంక్షేమ పథకాలు చేపట్టామని.. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయని చెప్పారామె. వీటిని చూసి ఓర్వలేకనే తప్పుడు ప్రచారాలతో ఎదురుదాడి చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ వైసీపీపై హోంమంత్రి అనిత తీవ్ర విమర్శలు చేశారు. అబద్దాలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీ హయాంలోనూ అవే అవాస్తవాలను ప్రచారం చేశారని దుయ్యబట్టారు. ఉదయం




లేచింది మొదలుకొని అమరావతి మునిగిపోయింది అని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో నిర్మాణాల వద్ద పునాదుల వద్ద కాస్త నీరు చేరవా అని ఆమె ప్రశ్నించారు. నెగిటివ్ యాంగిల్‌లో సోషల్ మీడియాలో ప్రొజెక్ట్ చేయడం దారుణమన్నారు. అమరావతి మహిళా రైతులు నాడు బయటకు వచ్చి పాదయాత్రలు చేసి అమరావతిని నిలబెట్టారని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ అమరావతిపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారంటూ హోంమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి మునిగిపోతుంది.. పొన్నూరు వైపు నీటిని డైవర్ట్ చేశారని అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని అనిత ఫైర్ అయ్యారు. ఇలాంటి తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# సాఫ్ట్ కాపీ చూపించినా జీరో టికెట్ ఇవ్వాల్సిందే

**అమరావతి:** ఏపీలో పంద్రాగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయాన్ని కల్పిస్తున్నారు. స్త్రీ శక్తి పేరుతో అమలు చేస్తున్న ఈ పథకంలోని లోటుపాట్లపై తాజాగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఘాట్ రోడ్లలో కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని ఆదేశించారు. గుర్తింపు కార్డు ఒరిజినల్ లేకపోతే సాఫ్ట్ కాపీ చూపించినా ఉచిత ప్రయాణానికి అనుమతించాలని తెలిపారు. ధ్రువీకరణ కోసం జిరాక్స్‌తో పాటు మొబైల్ డిజిలాకర్‌లోని సాఫ్ట్ కాపీని కూడా అనుమతించాలని ఆదేశించారు. స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకానికి మహిళల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తుందని ఈ సమీక్షలో అధికారులు



తెలిపారు. సోమవారం ఒక్కరోజే 18 లక్షల మంది ఉచిత ప్రయాణం చేశారని పేర్కొన్నారు. జీరో ఫేర్ టికెట్ల ద్వారా మహిళలకు రూ.7 కోట్లకు పైగా ఆదా అయ్యిందని అధికారులు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే గుర్తింపు కార్డుగా సాఫ్ట్ కాపీ చూపినా ఉచిత ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. అలాగే స్త్రీ శక్తి పథకం వర్తించే బస్సు సర్వీసులను మహిళలు సులభంగా గుర్తించేలా బస్సు లోపల, బయట బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే తాట తీస్తామని సీఎం చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు. ఆడబిడ్డలను అవమానించిన అంశంలో తాను, పవన్ కల్యాణ్ ఇద్దరం బాధితులమే అని తెలిపారు. క్యారెక్టర్ అసాసియేషన్ ఎవరు చేసినా వదిలిపెట్టమని స్పష్టం చేశారు. ఎవరైనా తోక తిప్పితే తో కట్ అవుతుందని హెచ్చరించారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకురావడానికి వెనుకాడమని స్పష్టం చేశారు.

# యాత్రికులకు అలర్ట్ ఆగిన పాపికొండల విహారయాత్ర

**అమరావతి, ఆగస్ట్ 19:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో రాష్ట్రంలోని దాదాపుగా అన్ని నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. అలాంటి వేళ.. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులు జల కళను సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్‌ల నుంచి నీటిని ఉన్నతాధికారులు కిందికి విడుదల చేస్తున్నారు. ఆ క్రమంలో పలు జలాశయాల్లోని నీటి వివరాలు మంగళవారం అధికారులు వివరించారు. విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్ వద్ద నీటి వరద ఉధృతి పెరుగుతొంది. ఉదయం 6.00 గంటలకు ప్రకాశం బ్యారేజీ నుంచి 3,22 000 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే కృష్ణ తూర్పు, పశ్చిమ కాలువలకు 3,837 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు వివరించారు. ఇక బ్యారేజ్ వద్ద 10.5 అడుగుల నీటిమట్టాన్ని మెయింటైన్ చేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఇక నంద్యాల జిల్లా శ్రీశైలం జలాశయానికి మరోసారి వరద ఉధృతి పెరిగింది. దీంతో జలాశయం 10 రేడియల్ క్రస్ట్ గేట్లు.. 12 అడుగులు మేర ఎత్తివేశారు. ఇన్ ఫ్లో: 3,73,024 క్యూసెక్కులు.. ఔట్ ఫ్లో : 3,70,158 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్దాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 881.70 అడుగుల వరకు నీరు చేరుకుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ: 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం: 197.4617 టీఎంసీలు ఉంది. అలాగే కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. కర్నూలు



జిల్లాలోని సుంకేశుల డ్యామ్‌కు వరద నీరు భారీగా చేరుకుంది. దీంతో డ్యామ్‌లోని 20 గేట్లను అధికారులు ఎత్తివేశారు. ఇన్ ఫ్లో 1, 40, 00 క్యూసెక్కులు కాగా.. అవుట్ ఫ్లో 1, 36, 587 క్యూసెక్కులుగా ఉంది. డ్యామ్‌లో పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 0. 8608 టీఎంసీలు. ఇక కేసీ కెనాల్‌కు 2180 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్ట్ వద్ద క్రమంగా వరద ఉధృతి పెరుగుతోంది. స్పిల్ వే వద్ద 31.680 మీ.. అలాగే అప్పర్ కాపర్ డ్యామ్ వద్ద 32.310మీ మేరకు నీటి మట్టం చేరింది. ఇక స్పిల్ వే ద్వారా 7,92,679 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. రాజమండ్రి సమీపంలోని ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ ఇప్పటికే 10.50 అడుగులకు నదిలో నీటిమట్టం పెరిగింది. దీంతో బ్యారేజ్‌లోని 175 గేట్లు అధికారులు స్వల్పంగా ఎత్తారు. బ్యారేజ్ నుంచి 8.23 లక్షల క్యూసెక్కులు వరద నీరు దిగువకు విడుదల చేశారు. అలాగే పాపికొండల విహార యాత్రను సైతం తాత్కాలికంగా నిలిపివేశారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు నదిలో వరద నీటి ప్రవాహం పెరుగుతుంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలతో చింతూరు వద్ద శబరి నది ప్రమాదకరంగా మారింది. కూనవరం మండలం కొండ్రాజుపేట వద్ద కాజ్ వేపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. వరరామచంద్రాపురం మండలం అన్నవరం వాగు, జల్లివారి గూడెం వాగులు పొంగడంతో ఆ ప్రాంతాలోని రహదారులు మునిగాయి. ఇక చింతూరు మండలంలో సోకు లేరు వాగు పొంగడంతో.. వీఆర్ పురం మండలం వైపునకు రాకపోకలు నిలిచి పోయాయి. స్పందించిన ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ..మరో వైపు భారీ వర్షాలు, వరద నీరు పోటెత్తడంతో.. కృష్ణా నదికి వరద ప్రవాహం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ స్పందించింది. ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద పరిస్థితి ఉధృతంగా ఉంది. దీంతో మధ్యాహ్నం లోపు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. ప్రస్తుత ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 3.25 లక్షల క్యూసెక్కులగా ఉంది. ఇది 5 లక్షల క్యూసెక్కులు వరకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో ప్రభావిత జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆ క్రమంలో కృష్ణానది పరీవాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. అలాగే లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి కోరింది. అందులోభాగంగా వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయ వద్దని సూచించింది.

# వివేకా హత్య కేసు నిందితుల బెయిల్ రద్దుపై సుప్రీంకోర్టులో విచారణ

**అమరావతి:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితుల బెయిల్ రద్దుపై సుప్రీంకోర్టులో(మంగళవారం) విచారణ జరిగింది. జస్టిస్.సుందరేశ్, జస్టిస్ సింగ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. కడప ఎంపీ అవినాష్ బెయిల్ రద్దు చేయాలంటూ.. సునీత తరపు లాయర్ సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు గడువు విధించినందు వల్లే దర్యాప్తును ముగించినట్లు సీబీఐ చెబుతోందని ఆయన వ్యాఖ్యానించారు. హత్య కేసులో మరింత దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని సిద్ధార్థ లూథ్రా కోర్టుకు తెలిపారు. సూత్రధారులు ఎవరో తేల్చాల్సిన అవసరం ఉందని సిద్ధార్థ లూథ్రా సుప్రీంకు విన్నవించుకున్నారు. నిందితులు సాక్ష్యులను బెదిరించడమే కాకుండా.. సాక్ష్యాలను నాశనం చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. సునీత దంపతులతోపాటు సీబీఐ అధికారి రామ్‌సింగ్‌పైనా కేసు పెట్టారని చెప్పుకొచ్చారు. దస్తగిరి జైలులో ఉన్నప్పుడు నిందితుడు శివశంకర్ రెడ్డి కుమారుడు చైతన్య రెడ్డి జైలుకు వెళ్లి బెదిరించాడని ఆరోపించారు. అవినాష్ రెడ్డే వివేకా హత్యలో మాస్టర్ మైండ్ అని ధర్మాసనానికి తెలిపారు. కేసులో మరింత లోతుగా దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని, అసలు సూత్రధారులు, పాత్రధారులు ఎవరో బయటికి రావాల్సి ఉందని సిద్ధార్థ లూథ్రా తన వాదనలు ముగించారు. అనంతరం సీబీఐ తరపు వాదనలను



సీబీఐ అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వినిపించారు. నిందితుల బెయిల్ రద్దు చేయాలని సుప్రీంను కోరారు. నిందితులను కాలపరిమితి లేకుండా జైలులో ఉంచడం మంచిది కాదని కానీ హత్య జరిగిన తీరు చూస్తే... నిందితులకు 5 సంవత్సరాలు జైలు శిక్ష చాలా తక్కువే అనిపిస్తోందని తెలిపారు. కేసులో ఆధారాలు చెరిపేయడం,ఎవరో తేల్చాల్సిన అవసరం ఉందని సాక్ష్యాధారాలు లేకుండా చేయడం నిరూపితమైందని చెప్పారు. ముందు గుండె పోటు అని తర్వాత రక్తపు వాంతులు అని ప్రచారం చేశారని చెప్పుకొచ్చారు. నిందితులు హత్య అని తెలియకుండా అన్ని విధాలా ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇవన్నీ దర్యాప్తులో పూర్తిగా బయటపడ్డాయని స్పష్టం చేశారు. నిందితుడు శివశంకర్ రెడ్డి కొడుకు చైతన్య రెడ్డి మెడికల్ క్యాంప్ పేరుతో కడప జైలుకు వెళ్లారని, ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలు ఫోటోలతో సహా... ఉన్నాయని కోర్టుకు వివరించారు. జైలుకు వెళ్లి.. అక్కడ కేసులో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరిని బెదిరించినట్లు సాక్ష్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. అవన్నీ నిరూపితం అయ్యాయని స్పష్టం చేశారు. అన్ని సాక్ష్యాలను ఏపీ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మదీ కోర్టుకు అందించారు. ఈ మేరకు తదుపరి దర్యాప్తు అవసరమో లేదో చెప్పాలని ధర్మాసనం సీబీఐని నిర్దేశించింది. దర్యాప్తులో నిందితులను కస్టోడియల్ విచారణ చేయాలో వద్దో కూడా చెప్పాలని పేర్కొంది. ఎంత మంది నిందితుల బెయిల్ రద్దు చేయాలన్న విషయాన్నీ చెప్పాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. వివేకా కుమార్తె, అల్లుడు సునీతా రెడ్డి, నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి, సీబీఐ విచారణాధికారి రామ్‌సింగ్‌పై పెట్టిన కేసులను క్వాష్ చేస్తామని వెల్లడించింది. చట్టాన్ని దుర్వినియోగం చేయడానికే వారిపై కేసు పెట్టారని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు సుప్రీం ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే నెల 9(సెప్టెంబర్ 9)కి వాయిదా వేసింది.

# తాడిపత్రి అరాచకాలపై సిట్‌తో విచారణ జరపాలి: పెద్దారెడ్డి

**అనంతపురం, ఆగస్టు 19:** పోలీసులను అడ్డు పెట్టుకుని టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి రాజకీయాలు చేస్తున్నారని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. మంగళవారం అనంతపురంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. తాడిపత్రికి వెళ్లాలంటే వీసా కావాలా? అని ప్రశ్నించారు. తాడిపత్రి వెళ్లాలంటే జేసీ ప్రభాకర్ రెడ్డి అనుమతి కావాలా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. అందుకోసం.. పోలీసులు చెబితే తాను దరఖాస్తు చేస్తానంటూ కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పష్టం చేశారు. తనపై పోలీసులు ఆంక్షలు పెట్టడం దుర్మార్గమని చెప్పారు. ఆ క్రమంలో తాను ఎక్కడికి వెళ్లినా.. పోలీసులు తన వెంట పడుతున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రి పోలీసుల వైఖరి ఏకపక్షంగా ఉందని విమర్శించారు. తాడిపత్రిలో వైసీపీ నేతలపై జేసీ వర్గీయులు దాడులు చేస్తున్నా... పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జేసీ ప్రభాకర్ రెడ్డికి దమ్ము ధైర్యం ఉంటే అభివృద్ధిలో పోటీ పడాలంటూ ఈ



సందర్భంగా కేతిరెడ్డి సవాల్ విసిరారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు గొప్పతనం అనుకుంటున్నారా? అంటూ జేసీ ప్రభాకర్ రెడ్డిని పెద్దారెడ్డిని సూటిగా ప్రశ్నించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి చేతిలో పోలీసు అధికారులు బందీ అయ్యారంటూ నిప్పులు చెరిగారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నా... తనను తాడిపత్రిలోకి అనుమతించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాడిపత్రి అరాచకాలపై సిట్ విచారణ జరపాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తద్వారా తాడిపత్రిలో తాను దౌర్జన్యం చేశానో... జేసీ ప్రభాకర్ రెడ్డి అరాచకం చేశారో తేలుతుందని స్పష్టం చేశారు. తాడిపత్రి ప్రజలు నిజంగా నన్ను అడ్డుకుంటే తన ఇల్లు రాసిస్తానంటూ ప్రత్యర్థులకు సవాల్ విసిరారు. పోలీసుల అండతోనే జేసీ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నేతలు అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని ఆందోళన చెందారు. ప్రజల నుంచి అక్రమ వసూళు చేయడం మానుకోమంటూ జేసీ ప్రభాకర్ రెడ్డికి ఆయన హితవు పలికారు. తాడిపత్రి నియోజకవర్గంలో తనకు 80 వేల ఓట్లు వచ్చాయని గుర్తు చేశారు. దీంతో తాడిపత్రి ప్రజలు తనను వ్యతిరేకించటం లేదని ఆయన స్పష్టం చేశారు.

# ఏపీ మహిళలకు ఫ్రీ బస్సు అంతకుమించి ఇకపై ఘాట్ రోడ్లలోనూ

**అమరావతి, ఆగస్ట్ 19:** ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ పథకం 'స్త్రీశక్తి'కి అద్భుతమైన స్పందన కనిపిస్తోంది. రోజు రోజుకీ మహిళా ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. సోమవారం ఒక్క రోజులోనే 18 లక్షల మందికి పైగా మహిళలు జీరో ఫేర్ టికెట్‌తో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. అలాగే పథకం ప్రవేశపెట్టిన నాలుగు రోజుల్లో 47 లక్షల



మంది మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే 'స్త్రీ శక్తి' పథకంపై తాజాగా సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఘాట్ రోడ్లలో నడిచే ఆర్టీసీ సర్వీసుల్లోనూ స్త్రీ శక్తి పథకం అమలు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈమేరకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంతేకాదు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద ప్రయాణించే మహిళలు గుర్తింపు ధృవీకరణ కోసం ఆధార్ జిరాక్సుతో పాటు మొబైల్ డిజిటల్ లాకర్‌లోని సాఫ్ట్ కాపీని కూడా అనుమతించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్త్రీశక్తి పథకం వర్తించే సర్వీసులను మహిళలు సులభంగా గుర్తించేలా బస్సు లోపలా బయటా బోర్డులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

# తిరుమలలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2 వరకు బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లపై ఈవో సమీక్ష

**తిరుమల :** తిరుమలలో ఈ ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగనున్నాయని టీటీడీ ఈవో జె. శ్యామలారావు తెలిపారు. అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో పాటు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణలతో కలిసి సోమవారం అన్నమయ్య భవనంలో సమీక్షా సమావేశం



నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 24న బ్రహ్మోత్సవాల తొలి రోజు పట్టు వస్త్రాలను సమర్పిస్తారని వివరించారు. సెప్టెంబర్ 28న గరుడ సేవ అక్టోబర్ 2న చక్రస్నానం కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చే రద్దీని ముందుగా అంచనా వేసి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వాహన రాకపోకలను అంచనా వేసేందుకు టెక్నాలజీ సాయం తీసుకోవాలని సూచించారు. ఎక్కువమంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆలయం, గ్యాలరీల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో జిల్లా పోలీసులతో సమన్వయంతో భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈవో సూచించారు. తిరుమలలో పార్కింగ్ స్థలాలను ఎంపిక చేసి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టీటీడీ ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, సీఈ సత్య నారాయణ, ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం జగదీష్, ఇతర టీటీడీ, పోలీసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అమరావతిపై జగన్ మీడియా అసత్య ప్రచారం కొలికపూడి ధ్వజం

**ఎన్టీఆర్ జిల్లా, ఆగస్టు19:** అమరావతిపై విషపు రాతలు రాస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై చర్చకు తాను సిద్ధమని.. జగన్ మోహన్ రెడ్డి సిద్ధమా, లేకపోతే వైసీపీ నుంచి ఎవరూ వచ్చినా తాను చర్చించడానికి సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. గత వారం రోజుల నుంచి భారీ



వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. చిన్నపాటి వర్షానికే అమరావతి మునిగిందని జగన్ తన మీడియా ద్వారా అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు2014లో ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధాని అని చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని తెలిపారు. అమరావతికి అప్పటి మిత్రపక్షమైన బీజేపీ మద్దతు పలకగా బయట నుంచి జనసేన మద్దతు పలికిందని.. అసెంబ్లీలో వైసీపీ కూడా మద్దతు పలికిందని గుర్తుచేశారు. జగన్ తన సొంత ఇంటిని తాడేపల్లిలో కట్టుకున్నాడని.. తాడేపల్లిలో జగన్ ఇల్లు మునిగిందా అని సూటిగా ప్రశ్నించారు. 400 ఏళ్ల చరిత్ర గల హైదరాబాదే చిన్నపాటి వర్షానికి అతలాకుతలం అవుతుంటే.. సముద్ర మట్టానికి అత్యంత దగ్గరగా ఉండే అమరావతిలో చిన్నపాటి వర్షం కురిస్తే.. ఆ వర్షానికే అమరావతి మునిగిందని జగన్ చెప్పటం విడ్డూరంగా ఉందని విమర్శించారు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు. చంద్రబాబు దూర దృష్టితో ఆలోచించి కొండవీటి వాగు నిర్మాణాన్ని చేపట్టి ఆ వాగు ద్వారా వరద నీటిని నదిలోకి మరలించటం జగన్‌కి తెలియదా అని నిలదీశారు. 2019లో వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ రాయపూడిలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రకృతి కన్నెర్ర చేస్తే ప్రళయాలు తప్పవని ముంబై ,జమ్మూ కాశ్మీర్‌లలో సంభవించిన వరదలే సాక్ష్యమని చెప్పుకొచ్చారు. ఇప్పుడే పుట్టిన అమరావతి పసికూనను జగన్ నాశనం చేయాలనుకుంటే అమరావతి రైతులు ఉద్యమం చేపట్టి జగన్‌ను పాతాళ లోకానికి తొక్కేస్తారని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

# వైసీపీ విష ప్రచారానికి ఆ 11 సీట్లు కూడా రావు మంత్రి నారాయణ వార్నింగ్

**అమరావతి, ఆగస్టు19 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపైఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై మీ ఏడుపులు ఇకనైనా ఆపాలని హితవు పలికారు. కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం వల్ల నీరు నిలిచిపోయిన నీరుకొండ పరిసర ప్రాంతాలను మంత్రి నారాయణ (మంగళవారం) పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి నారాయణ మాట్లాడారు. పశ్చిమ బైపాస్ రోడ్డుపై బ్రిడ్జి



నిర్మాణంతో కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడిందని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో మట్టిని అడ్డు వేసి వదిలేయడంతో వాగు ప్రవాహానికి ఇబ్బందులు వచ్చాయని వివరించారు మంత్రి నారాయణ.అడ్డుగా ఉన్న మట్టిని తొలగించడంతో పాటు వెస్ట్ బైపాస్ రోడ్డుకు రెండు చోట్ల గండ్లు కొట్టి నీరు వెళ్లేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జగన్ అండ్ కో విష ప్రచారాలు చేస్తే వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన ఆ 11 సీట్లను కూడా ప్రజలు ఇవ్వరని చెప్పుకొచ్చారు. నిర్మాణాలు జరిగేటప్పుడు వర్షం వస్తే గుంతల్లోకి నీళ్లు రావా...? అని ప్రశ్నించారు. గుంతల్లోకి నీరు వస్తే ఐకానిక్ భవనాలు మునిగిపోయినట్లేనా? అని నిలదీశారు. పశ్చిమ బైపాస్‌పై బ్రిడ్జి నిర్మించిన దగ్గర మట్టి అడ్డుగా ఉండటంతో నీరు నిలిచిపోయిందని తెలిపారు మంత్రి నారాయణ. అది కూడా కేవలం రెండు గ్రామాల పరిధిలో మాత్రమే పొలాల్లో నీరు నిలిచిందని.. మిగతా గ్రామాల్లో వర్షం పడిన కొన్ని గంటల్లోనే నీరు బయటకు వెళ్లిపోయిందని వెల్లడించారు. కొండవీటి వాగు ప్రవాహానికి అడ్డంగా ఉన్న మట్టిని తొలగిస్తున్నామని అన్నారు. అధికారులు, ఇంజనీర్లు కలిసి కొండవీటి వాగు ప్రవాహానికి అడ్డంగా ఉన్న మట్టిని తొలగించే పనుల్లో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈరోజు రాత్రికి మొత్తం నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాజధాని అమరావతి మునిగిపోతుందంటున్న వారు ఇక్కడికి వచ్చి చూడాలని.. కారణాలు తెలియకుండా మాట్లాడవద్దని హితవు పలికారు. వైసీపీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించరని మంత్రి నారాయణ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

# ఉధృతంగా తుంగభద్ర నాలుగు చక్రాల బరువైన వాహనాలకు వంతెనపై బంద్



**కంప్లి(బెంగళూరు):** తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి పెరిగిపోయింది. సోమవారం జలాశయం నుంచి నదికి 26 గేట్లు ద్వారా 1,07,000 క్యూసెక్కుల నీరు బోర్డు అధికారులు విడుదల చేశారు. కాలవల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండంతో కంప్లి కోటే తుంగభద్ర నది వంతెనపై బరువైన వాహనాలకు అధికారులు నిలిపివేశారు. కేవలం ద్విచక్రవాహనం ఆటోలు, కార్లకు మాత్రమే అవకాశం కల్పించారు.నాలుగు చుక్కలు బరువైన వాహనాలకు వంతెనపై బంద్ చేయడంతో బుక్కసాగర మీదుగా గంగావతికి చేరుకుంటున్నాయి. ప్రతిసారి నదికి నీరు పోటెత్తడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నదికి నీరు పోటెత్తడంతో సన్నాపురం వద్ద రైతన్నలు మోటార్లలోకి నీరు చేరడంతో మోటార్లు ధ్వంసమయ్యాయి.మోటార్లను విప్పి గట్టుకు చేరుస్తున్నారు. యేడాదికి మూడుసార్లు నదికి ఎక్కువగా నీరు పోటెత్తడం వల్ల మోటార్లకు నీరు చేరుకుని మోటార్లు ధ్వంసమై ఒక్కో మోటారు రూ.పది వేలతో రిపేరీ చేయించామని రైతులు తెలుపుతున్నారు. మొత్తానికి యేడాది వర్షపాతం ఎక్కువగా వుండటంతో పంటలకు తెగులు సోకే ప్రభావం కూడా వుందన్నారు. రైతుకి ఈసారి రైతుకు కష్టాలు ఎక్కువగా కలిగాయన్నారు.

# ముంబైలో కుండపోత వర్షాలు జనజీవనం అస్తవ్యస్తం



**ముంబై:** భారీ వర్షాలకు ముంబై నగరం అతలాకుతలం అవుతోంది. నేడూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా జన జీవనం స్తంభించిపోయింది. పలు ప్రాంతాల్లో రోడ్లు నీట మునిగి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముంబైతో పాటు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయంటూ భారతీయ వాతావరణ శాఖ తాజాగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు అప్రమత్తమయ్యాయి.వర్షాల కారణంగా విమాన రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడింది. ముంబై నుంచి బయలుదేరాల్సిన 155 విమాన సర్వీసుల్లో జాప్యం జరిగింది. ముంబై ఎయిర్‌పోర్టుకు రావాల్సిన మరో 102 విమానాల ల్యాండింగ్ కూడా ఆలస్యం కానుంది. ఇప్పటికే ప్రయాణికులకు ఇండిగో అలర్టులు జారీ చేసింది. ఎయిర్‌పోర్టుకు వచ్చే పలు మార్గాలు నీట మునిగి ట్రాఫిక్ జాం ఏర్పడిందని తెలిపింది. ఫలితంగా కార్యకలాపాల నిర్వహణలో ఆటంకాలు ఏర్పడి విమాన రాకపోకల్లో జాప్యం జరుగుతోందని పేర్కొంది.వర్షాల కారణంగా నగర జీవనం అస్తవ్యస్థం కావడంతో ముంబై నగర పాలక సంస్థ నేడు సెలవును ప్రకటించింది. అత్యవసర ప్రభుత్వ సేవలు మాత్రమే అందుబాటులో ఉంటాయని పేర్కొంది. ప్రైవేటు సంస్థలు తమ ఉద్యోగులకు నేడు వర్క్ ఫ్రమ్ హోం అవకాశం కల్పించాలని కూడా నగర పాలక సంస్థ సూచించింది. వర్ష బీభత్సం కారణంగా ఇప్పటికే పలు స్కూళ్లు, కాలేజీలు మూతపడ్డాయి. కొంకణ్ ప్రాంతాల్లోని (పాల్ఘడ్, థానే, రాయ్‌గఢ్, రత్నగిరి, సింధూదుర్గ్ జిల్లాలు) కాలేజీలకు సెలవు ఇచ్చినట్టు ఉన్నత విద్యాశాఖ పేర్కొంది. రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్టు బస్సులను కూడా కొన్ని ప్రాంతాల్లో దారి మళ్లించారు. రైళ్ల రాకపోకల్లో కూడా ఆలస్యం చోటుచేసుకుంది. కొన్ని ప్రాంతాల్లో ట్రాక్స్‌పై నీరు చేరడంతో ఆటంకాలు ఏర్పడ్డాయని రైల్వే అధికారులు తెలిపారు.

# ఎస్సై మరణానికి కారణమైన వీధి కుక్క



**ఉత్తర ప్రదేశ్ :** ప్రస్తుతం వీధి కుక్కల గురించి జోరుగా చర్చ జరుగుతోంది. వీధి కుక్కల వలన చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని కొందరు వాదిస్తున్నారు. సుప్రీంకోర్టు కూడా వీధి కుక్కలను ప్రత్యేక షెల్టర్లలోకి తరలించాలని తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తాజాగా ఉత్తరప్రదేశ్ లో ఓ వీధి కుక్క ఓ పోలీస్ అధికారి మరణానికి కారణమైంది.యూపీలోని కవినగర్ పోలీస్ స్టేషన్‌లో డ్యూటీ ముగించుకుని ఇంటికి బైక్ పై బయల్దేరిన సబ్-ఇన్‌స్పెక్టర్ రిచా సచన్ (25) సోమవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ప్రమాదానికి గురయ్యారు. అకస్మాత్తుగా రోడ్డుపైకి దూసుకొచ్చిన ఓ వీధి కుక్కను రిచా బైక్ ఢీకొట్టింది. దీంతో రిచా బ్యాలెన్స్ కోల్పోయి రోడ్డుపై పడిపోయారు. వెనుక వస్తున్న కారు రిచా పైనుంచి దూసుకెళ్లిపోయింది. రిచా హెల్మెట్ ధరించినప్పటికీ తీవ్ర గాయాలు కావడంతో ఆమె చనిపోయింది.సమాచారం అందుకున్న పోలీసులు రిచాను సర్వోదయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మరణించిందని వైద్యులు ధ్రువీకరించారు. కాన్పూర్‌కు చెందిన రిచా 2023లో సబ్-ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. ఆమె శాస్త్రి నగర్ అవుట్ పోస్ట్ ఛార్జ్‌ని చూసుకుంటూనే యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

# తెలంగాణలోని ఇద్దరు సివిల్ సర్వెంట్స్‌పై కేంద్రానికి బీఆర్ఎస్ ఫిర్యాదు



**ఢిల్లీ :** తెలంగాణలో ఐపీఎస్ అధికారి డీఎస్ చౌహాన్, ఐఏఎస్ అధికారి హరిచందన కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలను తప్పుదారి పట్టించేలా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. వారిపై ఢిల్లీలో మంగళవారం కేంద్ర సిబ్బంది, ప్రజా వ్యవహారాల శాఖ మంత్రి జితేంద్ర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.ఆ ఇద్దరు అధికారులపై ఆలిండియా సర్వీస్ ప్రవర్తనా నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని తమ ఫిర్యాదులో కోరారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతలు సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్ (ఎమ్మెల్సీ), బాల్క సుమన్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేశారు.

# అసోం సర్కారుపై గౌహతి హైకోర్టు ఫైర్



**అసోం:** రాష్ట్రంలోని డిమా హసావో జిల్లాలో మహాబల్ సిమెంట్స్ అనే ప్రైవేట్ సిమెంట్ కంపెనీకి ఏకంగా 3,000 బీఘాల (దాదాపు 992 ఎకరాలు) భూమిని కేటాయించడంపై గౌహతి హైకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాన్ని అసాధారణమైనదిగా అభివర్ణించిన న్యాయస్థానం.. 'ఇది పరిహాసమా.. ఒక జిల్లా మొత్తాన్ని రాసిస్తు న్నారా..?'అంటూ సీరియస్‌గా ప్రశ్నించింది.

# ఉపరాష్ట్రపతి అభ్యర్థి నాలుగు దశాబ్దాల లీగల్ కెరీర్



**న్యూఢిల్లీ:** ఉపరాష్ట్రపతి పదవిని ఏకగ్రీవం చేయాలనే ఎన్డీయే కూటమి ఆశలపై విపక్ష 'ఇండియా' కూటమి నీళ్లు చల్లింది. తమ కూటమి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి పేరును మంగళవారంనాడు ప్రకటించింది. దీంతో ఎన్డీయే కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, 'ఇండియా' కూటమి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డి మధ్య ముఖాముఖీ పోటీ నెలకొంది.జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి పేరును కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారు. దేశంలోని ప్రముఖ, ప్రగతిశీల న్యాయవాదుల్లో సుదర్శన్ రెడ్డి ఒకరని, సుదీర్ఘమైన లీగల్ కెరీర్ కలిగి, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడంలో విఖ్యాతి పొందారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. ఆయన పేదల పక్షపాతి అని, రాజ్యాంగం, ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ఎంతో పాటుపడ్డారని వివరించారుజస్టిస్ బి సుదర్శన్ రెడ్డి గురించి.1. 78 ఏళ్ల జస్టిస్ (రిటైర్డ్) రెడ్డి నాలుగు దశాబ్దాల లీగల్ కెరీర్ సాగించారు. 1946 జూలై 8న జన్మించిన ఆయన 1971 డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ అడ్వకేట్‌గా పేరు నమోదు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్, సివిల్ మేటర్స్‌లో ప్రాక్టీసు చేశారు.2. 1988-1990 మధ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా సేవలందించారు. 1990లో కొద్ది కాలం కేంద్రానికి అదనపు స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు.3. ఉస్మానియా యూనివర్శిటీ లీగల్ అడ్వైజర్‌గా, స్టాండింగ్ కౌన్సిల్‌గా కూడా పనిచేశారు.4.1995 మేలో ఆంధ్రప్రదేశ్ హైకర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆ తర్వాత 2005 డిసెంబర్‌లో గువాహటి చీఫ్ జస్టిస్‌గా పదోన్నతి పొందారు.5.2007 జనవరి 12న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. 2011 జూలై 8న పదవీ విరమణ చేసేంత వరకూ తమ సేవలు అందించారు.మరిన్ని వివరాలు..జస్టిస్ రెడ్డి 2013 మార్చిలో గోవా మొదటి లోకాయుక్తగా పనిచేశారు. అయితే ఏడు నెలల్లోనే వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేశారు. హైద్రాబాద్‌లోని ఇంటర్నేషనల్ అర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ బోర్డర్ ఆఫ్ ట్రస్టీగా కూడా ఆయన సేవలందించారు. తాజాగా ఆయనను ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో విపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా 'ఇండియా' కూటమి ప్రకటించింది.

# జయలలిత నెచ్చెలి శశికళ ఆసక్తికర కామెంట్స్

**అన్నాడీఎంకే మరింత బలపడాల్సి ఉంది**

**– జన్మదిన వేడుకల్లో వీకే శశికళ**



**చెన్నై:** రాష్ట్రాన్ని 30యేళ్లకు పైగా పరిపాలించిన అన్నాడీఎంకే మరింత బలపడడానికి అనుభవం కలిగిన వారి సలహాలను పాటించాలని దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వీకే శశికళఅభిప్రాయపడ్డారు. స్థానిక పోయెస్ గార్డెన్‌లో ఉన్న నివాసంలో సోమవారం తన 71వ జన్మదినం సందర్భంగా ఆమె తమ మద్దతుదారులతో పేదలకు సంక్షేమ సహాయాలు అందించారు.అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఒకమాట, అధికారంలోకి వచ్చాక నాటకమాడుతోందన్నారు. 2020లో జీసీసీలో పనిచేసిన తాత్కాలిక పారిశుధ్య కార్మికుల వ్యవహారంలో అప్పటి సీఎం జయలలిత ఆచీ..తూచి.. వ్యవహరిస్తే, ప్రతిపక్షనేతగా ఉన్న స్టాలిన్ వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారన్నారు. 2021 డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పొందుపరిచి నాలుగేళ్లయినా పర్మినెంట్ చేయలేదన్నారు.ప్రభుత్వానికి ఎన్ని శాఖలున్నాయి? ఎంతమంది కార్యదర్శులున్నారు? వారితో ఎలా పనిచేయించాలో కూడా తెలియని వారు అధికారంలో ఉన్నారన్నారు. ఆచరణకు సాధ్యంకాని హామీల కోసం కోట్లాది మంది ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన నగదును సొంతంగా ఖర్చుచేయడాన్ని ఖండిస్తానన్నారు. గడువు తీరిన టోల్‌గేట్లను మూసివేయడంలేదన్నారు. డిప్యూటీ సీఎం ఉదయనిధి కార్‌రేస్ నిర్వహణకు రూ.200 కోట్లు ప్రభుత్వ సొమ్ము ఖర్చుచేశారన్నారు. నిధులు కేటాయింపుపై కేంద్రప్రభుత్వాన్ని దూషించడమే డీఎంకే ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందని విమర్శించారు.

# తెరపైకి రాజకీయాలకు సంబంధం లేని అభ్యర్థి ఇండియా కూటమి వ్యూహం అదేనా



**న్యూఢిల్లీ:** భారత 17వ ఉపరాష్ట్రపతి ఎన్నిక మొదట ఏకగ్రీవం అవుతుందని ప్రచారం జరిగింది.. కానీ.. అనూహ్యంగా ఇండియా కూటమి అభ్యర్థిని రంగంలోకి దింపింది. అధికార విపక్ష పార్టీలు దక్షిణాది రాష్ట్రాల నుంచి తమ అభ్యర్థులను ప్రకటించడంతో.. హస్తిన రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.. ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా అధికార పార్టీ తమిళనాడుకు చెందిన సిపి రాధాకృష్ణన్ ను ప్రకటించింది. ఈ క్రమంలోనే.. ఇండియా కూటమి కీలక నిర్ణయం తీసకుంది.. తెలంగాణకు చెందిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి బరిలోకి దించనున్నట్లు ప్రకటించింది. దీంతో సెప్టెంబర్ 9న భారత 17వ ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది.ఎవరి వ్యూహం వారిదే.బీజేపీ పార్లమెంటరీ సమావేశం అనంతరం ఎన్డీఏ తమ అభ్యర్థిని ప్రకటించింది. బీజేపీ సీనియర్ నేత.. మహారాష్ట్ర గవర్నర్, ఆర్ఎస్ఎస్ భావజాలం గల సీపీ రాధాకృష్ణన్ ను ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా ప్రకటించింది. కాగా.. ఉప రాష్ట్రపతి ఎన్నిక అభ్యర్థి ఎంపిక విషయంలో విపక్షాలు వ్యూహాత్మకంగా వ్యవహరించాయి. రాజకీయాలకు సంబంధం లేని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డిని ఇండి కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించింది. ఈ ప్రకటన %చీణాూ%ని అస్థిరపరిచేందుకు.. అలాగే.. ఇతర ప్రాంతీయ పార్టీలను ఇరుకున పెట్టడానికి తీసుకున్న చర్యగా కనిపిస్తుంది. .వ్యూహాత్మకంగా తెలుగు వ్యక్తి ఎంపిక.ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్ దక్షిణాది రాష్ట్రం తమిళ నాడు నుంచి ఎంపికైన తరువాత.. ఇండియా కూటమి అభ్యర్థి ఎక్కడి నుంచి ఎంపిక చేస్తారనేది.. ఉత్కంఠగా మారింది. ఈ క్రమంలో మరో తమిళుడికి అవకాశం ఇవ్వాలని.. రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తికి ఇవ్వాలని ఇండియా కూటమిలో చర్చ జరిగింది. త్వరలో ఎన్నికలున్న తమిళనాడు, బీహార్, బెంగాల్ నుంచి అభ్యర్థిని ఎంపిక చేసే అవకాశాలను ఇండియా కూటమి నేతలు పరిశీలించారు.. ఈ క్రమంలోనే.. అందరి నుంచి అభిప్రాయాలను తీసుకుని.. వ్యూహాత్మకంగా వ్యవహరించింది ఇండియా కూటమి.. చివరకు.. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా తెలుగు రాష్ట్రానికి చెందిన.. రాజకీయాలకు ఎటువంటి సంబంధం లేని వ్యక్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి(79) ని ఎంపిక చేసింది. చంద్రబాబుతో సాన్నిహిత్యం..సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేయడంతోపాటు.. పలు పార్టీల మద్దతు కూడగట్టేలా వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఎన్డీఏ కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ, న్యూట్రల్‌గా ఉన్న వైసీపీ, బిఆర్ఎస్, బీజేడీ పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తోంది ఇండియా కూటమి.. సుదర్శన్ రెడ్డికి టిడిపితో సుదీర్ఘ కాలం అనుబంధం ఉంది. 1980, 1990లలో తన న్యాయవాద జీవితంలో, ఆయన అప్పటి టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడుతో సన్నిహితంగా ఉండేవారు. టిడిపికి న్యాయపరమైన, చట్టపరమైన విషయాలలో సుదర్శన్ రెడ్డి సాయం అందించారు. ఇలా ఉమ్మడి రాష్ట్రంలోని రాజకీయాలతో సుదర్శన్ రెడ్డికి సాన్నిహిత్యం ఉంది.సుదర్శన్ రెడ్డి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడంతో ఎన్డీఏ మిత్రపక్షమైన చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ ఇప్పుడు క్లిష్ట పరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. టీడీపీ రాధాకృష్ణన్‌కు మద్దతు ఇచ్చినప్పటికీ, సుదర్శన్ రెడ్డికి పార్టీతో చారిత్రాత్మక సంబంధం కారణంగా టీడీపీ ఎలా వ్యవహరిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. మరోపక్క సుదర్శన్ రెడ్డికి మద్దతు కూడగట్టడానికి కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికేవంటి తటస్థ పార్టీలతో పాటు సంప్రదిస్తున్నట్లు సమాచారం..ఎన్డీఏకు మద్దతు ప్రకటించిన టీడీపీ-జనసేనఇప్పటికే టీడీపీ %-% జనసేన ఎన్డీఏ అభ్యర్థి సిపి రాధా కృష్ణన్‌కు అధికారికంగా మద్దతు ప్రకటించాయి.. వైసీపీ అధినేత జగన్‌తో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. బిఆర్ఎస్ తమ నిర్ణయాన్ని కేసీఆర్ కి వదిలేసింది. తెలుగు రాష్ట్రాల్లో రెడ్డి సామాజిక వర్గం కీలకం కావడం, వెంకయ్య నాయుడు తర్వాత మరో తెలుగు వాడికి ఉప రాష్ట్రపతి అయ్యే అవకాశం దక్కినట్లుగా కాంగ్రెస్ తోపాటు.. పలు ప్రతిపక్షాలు చెబుతున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల ఎంపీలు ఎవరివైపు మొగ్గు చూపుతారనేది వేచిచూడాల్సి ఉంది.జస్టిస్ సుదర్శన్ రెడ్డిజస్టిస్ సుదర్శన్‌రెడ్డి స్వస్థలం తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం.. వ్యవసాయ కుటుంబంలో జన్మించారు.. ఉస్మానియా యూనివర్సిటీలో(1971లో) చదివారు. 1993లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005లో గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2007 జనవరి 12న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. నాలుగున్నరేళ్లు సుప్రీం కోర్టులో పని చేశారు. రిటైర్డ్ అయ్యాక.. గోవాకు మొట్టమొదటి లోకాయుక్త చైర్మన్‌గా పని చేశారు. 2024 డిసెంబర్‌లో హైదరాబాద్ అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ మీడియేషన్ సెంటర్ శాశ్వత ట్రస్టీగా బాధ్యతలు చేపట్టారు.సెప్టెంబర్ 9న భారత 17వ ఉపరాష్ట్రపతి ఎన్నిక.17వ భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ సెప్టెంబర్ 9న జరగనుంది.. అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి.. ఇప్పటికే ఆగస్టు 7 న కేంద్ర ఎన్నికల సంఘం ఉపరాష్ట్రపతి ఎన్నిక నోటిఫికేషన్ జారి చేసింది. ఆగస్టు 21వరకు నామినేషన్ దాఖలుకు అవకాశం ఉంది.. ఆగస్టు 22 నామినేషన్ల పరిశీలన, ఆగస్టు 25 నామినేషన్ల ఉపసంహరణ గడువుగా ప్రకటించారు. సెప్టెంబర్ 9న పార్లమెంట్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు రహస్య బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరుగుతుంది అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి..

# తెరమీదకు 'సింధూర్ అగ్నివీర్'

- **అమర జవాన్ మురళీ స్టోరీ**
- **బిగ్ బాస్ ఫ్రెండ్ గౌతమ్ కృష్ణ టైటిల్ రోల్**
- **పాన్ ఇండియా రేంజ్ లో నిర్మాత కే సురేష్ రెడీ**
- **మురళి నాయక్ తల్లిదండ్రులు ఓకే**



**శ్రీ సత్యసాయి :** భారత్ - పాకిస్తాన్ మధ్య ఆపరేషన్ సింధూర్‌లో నేలకొరిగిన అమరవీరుడు తెలుగు జవాన్ మురళీ నాయక్ (22) జీవిత కథను తెరకెక్కించేందుకు నిర్మాత కె సురేష్ బాబు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈమేరకు అధికారికంగా ప్రకటించారు. బిగ్ బాస్ ఫేమ్ గౌతమ్ కృష్ణ ఈ చిత్రంలో టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. పాన్ ఇండియా రేంజ్ లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు నిర్మాత కె.సురేశ్ బాబు తెలిపారు. ఈసందర్భంగా గౌతమ్ కృష్ణ పలు వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సింధూర్ మన దేశ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే ఒక ముఖ్య అధ్యాయమన్నారు. దేశ ప్రజల కోసం వీరమరణం పొందిన మురళీ నాయక్ కథను ఈ ప్రపంచానికి చెప్పాలని, అందరూ తెలుసుకోవాలని, ఈ చిత్రం తీస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.అయితే, ఈ సినిమా నిర్మించేందుకు మురళీ నాయక్ తల్లిదండ్రుల అనుమతి కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో మురళీ నాయక్ తల్లిదండ్రులు ముదావత్ శ్రీరామ్ నాయక్, జ్యోతిబాయి పాల్గొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన మురళీ నాయక్ 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా నియంత్రణ రేఖ వద్ద శత్రు సైనికులతో పోరాడి వీర మరణం పొందారు. మురళి నాయక్ అంత్యక్రియలో రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మానవ వనరుల అభివృద్ధి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, హోంమంత్రి వంగలపూడి అనిత, అదేవిధంగా జిల్లా ఇన్చార్జి మంత్రి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, బీసీ మహిళా సంక్షేమ శాఖ చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ .సవిత స్వయంగా పాల్గొన్న విషయం తెలిసిందే.అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పలువురు సినీ ప్రముఖులు, కేంద్ర మంత్రులు, వివిధ సామాజిక వేత్తలు, పెద్ద ఎత్తున తరలివచ్చి మురళి ఘాట్ గా వద్ద నివాళులు అర్పించడంతోపాటు మురళి నాయక్ తల్లిదండ్రులను పరామర్శించడం తెలిసిందే. ప్రభుత్వం తరపున సుమారు కోటి రూపాయలు, అదేవిధంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి, పాతిక లక్షలు ఇంకా పలువురు లక్షల రూపాయలు మురళి నాయక్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీ సత్య సాయి జిల్లా చరిత్రలో ఆపరేషన్ సింధూర్ ఘటన లో జవాన్ మురళి నాయక్ వీరమరణం పొందడం చిరస్థాయిగా నిలిచిపోవడం ఖాయం. ఇలాంటి ఇతివృత్తాన్ని సినిమాగా తీయడంతో భవిష్యత్ తరాలకు వీర జవాన్ మురళి నాయక్ ఆదర్శంగా నిలిచిపోతుందని జనం అభిప్రాయం.

# కేంద్రం యూరియా రాజకీయం !

యూరియా కొరత,సరఫరాపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. బిజెపినేతలు కూడా సమస్యను పరిష్కరించేందుకు సాయం చేయకుండా ఎదురుదాడి చేస్తున్నారు.ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రైతులు పొలాలు వదిలి క్యూలో నిలబడి పోరాటం చేస్తున్నారు. చాలాకాలం తరవాత మళ్లీ యూరియా కోసం క్యూలు కడుతున్నారు. ఇది స్థానిక బిజెపి నేతలకు కనిపించక పోవడం దారుణం. సమస్యలను తెలుసుకుని వారధిగా నిలవాల్సిన స్థానిక బిజెపి నేతలు రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.వీరు ప్రజలకోసం పాలిస్తున్నారా లేక,విపక్ష పార్టీలను వేధించేందుకు పాలిస్తున్నారా అన్న అనుమానం కలుగుతోంది. పార్లమెంట్ వేదికగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోక పోవడం రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగానే చూడాలి.యూరియా కోసం పార్లమెంట్ ఎదుట రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోని కేంద్రం తీరు క్షంతవ్యం కాదు. ఇది రైతులను మోసించడమే తప్ప మరోటి కాదు. వ్యవసాయరంగంపై సరైన అవగాహన లేని పాలకుల తీరుకారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. యూరియా ఎంత ఇచ్చాం..ఎంత అవసరం అన్నది కూడా తెలియకుండా విమర్శలతో కాలం గడిపితే నష్టపోయేది రైతులే అని తెలుసుకోవాలి. రైతులకు అసవరమైన ఎరువులు,పురుగు మందులు, విత్తనాల కోసం రోడ్డెక్కకుండా చూడడం ప్రథమం. ఇవి కూడా చేయకుండా కల్లబొల్లి కబుర్లతో కాలం గడిపస్తున్నారు. ప్రకృతి సేద్యం, సేంద్రియ సాగు, జీవ ఎరువుల ముసుగులో రాష్ట్రాల ఎరువుల కేటాయింపులకు కోతలు విధించిందని ఆరోపిస్తున్నారు. ఏటేటా ఐదు నుంచి పది శాతం ఎరువుల వినియోగం పెరుగుతున్నది. దీనిని తగ్గించడానికి ముందు



కార్యాచరణ అవసరం. రైతుల్లో చైతన్యం తీసుకుని రావాలి. అలాగే రైతులకు అవసరమైన సేంద్రియ ఎరువులను సిద్ధం చేయాలి. అలాగే సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని పెద్ద ఎత్తున చేపట్టాలి. ఇవేవీ చేయకుండా యూరియా కోటాను ఈ మేరకు కుదించడం సరికాదు. కేంద్రం కేటాయింపులు పెంచాల్సిందిపోయి కుదించడటం సేద్యాన్ని, రైతులను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేయడమే కాగలదు. ఖరీఫ్ రైతుకు అదనకు అవసరమైన యూరియా పుట్టని దుస్థితి దాపురించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి తార్కాణం. మరోవైపు ఎరువులపై రైతులకు ఇచ్చే సబ్సిడీని భారంగా భావించిన కేంద్ర బిజెపి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తూ వస్తోంది. పర్యావరణం, ప్రజల ఆరోగ్యం కూడా ముఖ్యమే. ఇందుకు ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. కానీ అందుకు తగినకార్యాచర ఒకటి తయారు కావాలి. రైతులకు సేంద్రియ ఎరువులు అందుబాటులోకి తీసుకుని రావాలి. ఇవేవి చేయకుండా అమ్మకాలపై ఆంక్షలు పెట్టడం సరికాదు. గతేడాది పదిశాతం కేటాయింపులు తగ్గించిందని ఎపి రైతులు వాపోతున్నారు. ఆంధ్రా రాష్ట్రంలో నిరుడు 39 లక్షల టన్నుల అమ్మకాలు జరగ్గా 35 లక్షల టన్నులకు ఈ ఏడాది కేటాయింపులు కుదించబడ్డాయి. నాలుగు లక్షల టన్నులు తగ్గిపోయాయి. కేంద్రం ఎరువుల కేటాయింపులను తగ్గిస్తే మారు మాట్లాడకుండా కూటమి నేతలు భారాన్ని రైతులపైకి నెట్టేసారు. కేంద్ర మంత్రులు, ఎన్‌డిఎ ఎంపిలు ప్రధాని మోడీని మాటమాత్రం అడగడం లేదు. వ్యవసాయ రాష్ట్రాలైన తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌కు, ఇక్కడి రైతాంగానికి మోడీ ప్రభుత్వం అన్యాయం తలపెట్టినా కూటమి నేతలు, బిజెపి నేతలు, కేంద్రమంత్రులు చోద్యంచూస్తున్నారు. 2024 ఖరీఫ్‌లో ఎ.పి. యూరియా వినియోగం 6.32 లక్షల టన్నులు కాగా 2025లో 6.22 లక్షల టన్నులకు కేటాయింపు తగ్గింది. నెలనెలా కేటాయింపులు, వచ్చినది చూస్తే కోత ఇంకా ఎక్కువే.ఉదాహరణకు జులైలో 3.05 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా 2.85 లక్షల టన్నులే వచ్చాయి. ఈ కోతలు ఒక వైపు కొనసాగుతుండగా, గతేడాది ఖరీఫ్‌లో ఎప్పటి కంటే నైరుతి రుతుపవనాలు ఈ మారు మే 26న రాష్ట్రంలోకి ప్రవేశించడంతో సీజన్ నెల రోజులు ముందుకొచ్చింది. రాయలసీమ, మరికొన్ని ప్రాంతాల్లో రైతులు ముందస్తుగా పంటలు సాగు చేయడంతో ఒక్కసారిగా యూరియాకు డిమాండ్ వచ్చింది. ధరలు, తెగుళ్లు, నీటి సదుపాయం ఇత్యాది కారణాలతో రైతులు పంటలను మారుస్తున్నారు. యూరియా డిమాండ్‌కు పంటల సరళిలో చోటు- చేసుకున్న మార్పులు కొంత వరకు కారణం. కేంద్రం కోతలను మేనేజ్ చేసే పనిలో వ్యవసాయశాఖ తలమునకలై ఈ పరిస్థితులను అంచనా వేయలేకపోయింది. ఇవన్నీ కలిసి ఖరీఫ్ రైతును ఎరువుల కోసం రోడ్డెక్కేలా చేన్నాయి. ఎరువులు అందుబాటులో ఉన్నాయని కొరత లేదని ప్రభుత్వం ఎంతగా మభ్యపెట్టాలని ప్రయత్నించినా ఆ ప్రచారంలో నిజం లేదనడానికి పెద్ద పెద్ద క్యూలైన్లలో గంటల కొలది పడిగాపులు పడుతున్న అన్నదాత అవస్థలు కళ్లకుకడుతున్నాయి. సగం జిల్లాల్లో యూరియా, డిఎపి లభ్యత అవసరం కంటే తక్కువగా ఉందని ప్రభుత్వ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల్లో పొంతన లేకుండా మాట్లాడుతోంది. మార్క్‌ఫెడ్ వద్ద బఫర్ స్టాక్ అంటున్నా ఎటు తరలుతున్నాయో తెలీదు. ఇదే అదనుగా ప్రైవేటు డీలర్లు బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్ముతున్నారు. వేరే ఎరువుకు లింక్ పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వమే పెద్ద ఎత్తున నానో ఎరువులను అంటగట్టడంతో వాటిని వదిలించు కునేందుకు తంటాలు పడుతున్నారు. క్షణాల్లో సమాచారం అందించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాట్సాప్, రియల్ -టైం గవర్నెన్స్‌లు, డాష్ బోర్డులు రైతుల యూరియా కష్టాలను ఎందుకు పసిగట్టలేకపోతున్నాయో ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికే తెలియాలి. రైతులకు మేలు చేసే విధంగా వ్యవసాయశాఖతో పని చేయించాలి. తెలంగాణకు మొత్తం 9 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా 3 నుంచి 4 లక్షల టన్నుల యూరియా మాత్రమే ఇచ్చినట్లు ఎంపిలు ఆరోపించారు. ఫెర్టిలైజర్స్ పార్లమెంటరీ కమిటీ- ఛైర్మన్ క్రితీ ఆజాద్‌ను సోమవారం ఎంపీలు అంతా కలిసి ఈ అంశంపై వివరించినట్లు- చెప్పారు.

# పెను విపత్తులపై పాలకుల మొద్దునిద్ర



మేఘ విస్ఫోటాలు, మెరుపు వరదలు.. ఇటీవలి కాలంలో తరచూ వినబడుతున్న మాటలివి. కుండపోత వర్షాల గురించే తప్ప, వీటి గురించి ఐదారేళ్ల కిందటి వరకూ ఎవరికీ అంతగా తెలియదంటే అతిశయోక్తి కాదు. హిమాలయ పర్వత ప్రాంతాల్లోనూ, దేశంలోని ఇతర పర్వత పంక్తుల్లోనూ ఈ మధ్యకాలంలో తరచూ చోటు చేసుకుంటున్న ఈ తరహా ప్రకృతి వైపరీత్యాలు వెన్నులో వణుకుపుట్టిస్తున్నాయి. మొన్న సంభవించిన మెరుపు వరదల్లో జమ్ము కశ్మీర్ లోని చిసోటీ అనే కుగ్రామం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. ఇప్పటికి 65మంది గల్లంతు కాగా, మరో వందమంది జాడ తెలియడం లేదు. ఇక్కడ మేఘ విస్ఫోటం జరిగిన సమయంలోనే, సరిహద్దులకు ఆవలివైపు పాకిస్తాన్ లోని ఖైబర్ ఫక్తుంఖ్వా ప్రావిన్స్ లో పది గ్రామాలను భారీ వరదలు ముంచెత్తాయి. మూడువందల మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయారు. ఇల్లూవాకిలీ కోల్పోయి అధిక శాతం మంది నిరాశ్రయులయ్యారు. ఇదంతా జరగడానికి పది రోజుల ముందు ఉత్తర కాశీని సైతం మేఘ విస్ఫోటం వణికించింది. గంగోత్రికి వెళ్లే మార్గంలోని ధరాలీ అనే గ్రామాన్ని భారీ వర్షాలు ముంచెత్తాయి. యాభైమంది దుర్మరణం పాలు కాగా, వందలాది మంది జాడ ఇప్పటికీ తెలియలేదు. నేపాల్ కూడా తరచూ వర్షాలు, వరదలతో అతలాకుతలమవుతూ ఉండటం వింటూనే ఉన్నాం. సరిగ్గా ఏడాది క్రితం కేరళలోని వయనాడ్ లో పశ్చిమ కనుమలకు సమీపాన ఉన్న గ్రామాలపై కొండ చరియలు విరిగిపడి వందలాది మంది దుర్మరణం పాలైన సంఘటన గుర్తుండే ఉంటుంది. ఇదంతా చూస్తుంటే మంచుకొండలు, పర్వత పరిసర ప్రాంతాలు తరచూ మేఘవిస్ఫోటానికి, వరదలు, వర్షాల తాకిడికి గురవుతున్నట్లు అర్థమవుతుంది.దీనికంతటికీ కారణం వాతావరణ మార్పులేనని నిపుణులు చెబుతున్న మాటలు కొట్టిపారేయడానికి వీలు లేదు. అడవుల నరికివేత, పట్టణీకరణ పేరిట రోడ్లు, భవంతుల నిర్మాణం ఊపందుకోవడంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది.ఏదైనా ఒక ప్రాంతంలో గంట వ్యవధిలో వంద మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం సంభవించడాన్ని మేఘ విస్ఫోటమని అంటున్నారు. నిజానికి ఈ తరహా కుంభవృష్టి హిమాలయ రాష్ట్రాలకు కొత్తేమీ కాదు. అయితే, ఇటీవలికాలంలో వాటి తీవ్రత, సంభావ్యత పెరగడమే ఆందోళనకరం. భారీ వర్షాలు కురవడానికి సముద్రాలు వేడెక్కడం, భూతాపం వంటి వాతావరణ మార్పులు కారణమవుతున్నాయి. హిందూ మహాసముద్రంలో చోటు చేసుకుంటున్న ఈ రకమైన మార్పుల వల్ల భారత్ సహా పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాలు తరచూ ప్రకృతి వైపరీత్యాలకు గురవుతున్నాయి.వరుసగా కొన్ని రోజులపాటు అసలు వర్షాలే లేకపోవడం, అకస్మాత్తుగా కొన్ని రోజులపాటు కుండపోత వర్షాలు కురవడం వంటి సంఘటనలకు భూతాపమే కారణమన్నది శాస్త్రవేత్తల అభిప్రాయం. వయనాడ్, ధరాలీ, చిసోటీ గ్రామాల్లో చోటు చేసుకున్న ప్రకృతి వైపరీత్యాలు ఎన్నికలు, ఓట్ల చోరీ తాజా రాజకీయ పరిణామాల చాటున మరుగున పడిపోతున్నాయి. ఒకదాని వెంట ఒకటిగా సంభవిస్తున్న ఈ పెను ఉత్పాతాలపై దృష్టి సారించి, శాశ్వత పరిష్కారం కనుగొనాలన్న చిత్తశుద్ధి రాజకీయ వర్గాలలో కరవవుతోంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టడం, మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు నష్టపరిహారం ప్రకటిస్తే చాలునన్న ధోరణి పాలకులలో ప్రబలిపోతోంది. దేశవ్యాప్తంగా ఏయే ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉందో కళ్లకు కడుతూ గతంలోనే ఇస్రో లాండ్ స్లైడ్ అట్లాస్ ఆఫ్ ఇండియా పేరిట డేటాబేస్ తయారు చేసింది.ఉపగ్రహాల ద్వారా అందుతున్న సమాచారమూ ప్రకృతి వైపరీత్యాల గురించి అప్రమత్తం చేస్తూనే ఉంది. వీటన్నింటినీ క్రోడీకరించి విపత్తుల నివారణ, నిర్వహణకు ఆయా రాష్ట్రప్రభుత్వాలతో కలసి విధివిధానాలను రూపొందించి, భవిష్యత్తులో మరింతమంది అమాయకులు బలికాకుండా కాపాడవలసిన బృహత్ బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ప్రకృతి వైపరీత్యాలకు మనం పగ్గం వేయలేకపోవచ్చు. కానీ, వాటి ఉధృతి పెరిగేందుకు దోహదపడుతున్న మానవ తప్పిదాలను అరికట్టడం మన చేతుల్లోనే ఉంది. వాతావరణ నిపుణులు, ఇస్రో, ఖగోళ శాస్త్రవేత్తలు, విపత్తు నిర్వహణ విభాగపు అధికారులతో సంప్రదింపులు జరిపి, హిమాలయాలు, దేశంలోని ఇతర పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల రక్షణకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి ఓ పథకాన్నిరూపొందించడం అత్యంత ఆవశ్యకం. లేనట్లయితే, ఇలాంటి పెను ఉత్పతాలకు భవిష్యత్తులో మరిన్ని వందలాదిమంది అమాయకులు బలయ్యే ప్రమాదం ఉంటుంది. తస్మాత్ జాగ్రత్త!



# నాగా ఒప్పందంపై తాత్సారం దేనికి

ఈశాన్య భారతంలోని నాగాలాండ్ లో తిరుగుబాటును పరిష్కరించేదిశగా 3015 ఆగస్టు 3న భారత ప్రభుత్వం, నేషనల్ సోషలిస్ట్ ఆఫ్ నాగలిమ్(ఇసాక్-మయినా) (ఎన్ఎస్ సిఎన్-ఐఎం) మధ్య సంతకాలు జరిగిన ఫ్రేమ్ వర్క్ ఒప్పందం ఓ చరిత్రాత్మక ముందడుగు. భారతదేశంలో చాలా దీర్ఘకాలం పాటు సాగిన అంతర్గత సంఘర్షణల్లో ఒకటైన దీనికి శాంతియుత, సమగ్ర పరిష్కారాన్ని వాగ్దానం చేస్తూ, స్వతంత్ర ప్రతిపత్తి, నాగా గుర్తింపు డిమాండ్ల ను పురిష్కరించడం ఈ ఒప్పందం లక్ష్యం. అయితే, ఈ ఫ్రేమ్ వర్క్ అగ్రిమెంట్, 2019 ఆగస్టు 5న జమ్మూకశ్మీర్ లో ఆర్టికల్ 370 తో కలిపి అమలు కాకపోవడం, ప్రాంతీయ స్వయం ప్రతిపత్తి, ప్రత్యేక హోదాతో కూడిన ఒప్పందాలను గౌరవించడంలో భారత ప్రభుత్వం నిబద్ధత పై ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.ఈ వ్యాసం నాగా ఫ్రేమ్ వర్క్ ఒప్పందం లో చిక్కులు, దాని అమలులో లోపాలు, ఆర్టికల్ 370 రద్దుతో దాని సంబంధాన్ని చర్చిస్తున్నది. భారతదేశంలోని సమైక్యవాదం, నమ్మకం, ప్రాంతీయ ఆకాంక్షలపై దాని ప్రభావాలను పరిశీలిస్తుంది. నాగా ప్రజలు ప్రత్యేక చరిత్ర, గుర్తింపును గుర్తించడం, సార్వభౌమాధికారం కోసం డిమాండ్లతో 1940 నుంచి నాగా తిరుగుబాటు భారతదేశానికి ఓ ముఖ్యమైన సవాల్ గా నిలిచింది. అత్యంత ముఖ్య నాగా తిరుగుబాటు గ్రూప్ లలో ఒకటైన ఎన్ఎస్సిఎన్ -ఐఎంతో భారత ప్రభుత్వం శాంతి చర్చలు జరిపింది. ఇది ముసాయిదా ఒప్పందంతో ముగిసింది. ఒప్పందంపై అట్టహాసంగా సంతకం చేశారు. ప్రధాని మోదీ దీనిని నాగాలాండ్ , విస్తృత ఈశాన్య ప్రాంతాలలో శాంతి, అభివృద్ధికి మార్గం సుగమం చేసే ఒక మైలురాయిగా అభివర్ణించారు.ఈ ముసాయిదా ఒప్పందం నాగాల ప్రత్యేక చరిత్ర, ఉనికిని గుర్తించింది. భాగస్వామ్య సార్వభౌమాధికారం ఆధారంగా, భారత ప్రభుత్వం, నాగా ప్రజల మధ్య పరస్పర సంబందాన్ని ఏర్పరచడానికి ప్రయత్నించింది. ఈ ఒప్పందం లోని కచ్చితమైన వివరాలు బహిర్గతం కాలేదు. ముఖ్యమైన డిమాండ్లలో స్వయంప్రతిపత్తి, ప్రత్యేక నాగా రాజ్యాంగం, జెండా, నాగాలాండ్, మణిపూర్, అసోం, అరుణాచల్ ప్రదేశ్ లోని నాగా నివాస ప్రాంతాలను ఒకే పరిపాలనా సంస్థగా ఏకీకృతం చేయడం, ఉన్నాయి. దీనిని తరచుగా గ్రేటర్ నాగలిమ్ అని పిలుస్తారు. ఈ ఒప్పందం అహింస, నాగా ప్రజల ఆకాంక్షలను గౌరవించడానని కూడా వాగ్దానం చేసింది.

# మానవ చరిత్రలో ఒక అద్భుత యానం

జాతీయ విమాన యాన దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 19న ఘనంగా జరుపుకుంటారు. మానవ చరిత్రలో అత్యద్భుతమైన విప్లవ ఘట్టాల్లో ఒకటైన గగన యానం సాధనకు గుర్తుగా, విమాన యాన రంగంలో మార్గదర్శకుల కృషిని స్మరించుకునేందుకు ఈ రోజు ప్రత్యేకంగా నిలుస్తుంది. రైట్ బ్రదర్స్ 1903 డిసెంబర్ 17న తొలి విజయవంతమైన యాంత్రిక విమానాన్ని ఆకాశంలో ఎగరవేయడం ద్వారా మానవ కలలకు రెక్కలు వచ్చాయి. ఆర్విల్లే రైట్ జన్మదినం ఆగస్టు 19 కావడంతోనే అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి. రూజ్వెల్ట్ 1939లో ఈ రోజును విమానయాన దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా విమానయాన రంగం సాధించిన పురోగతిని గుర్తు చేసుకుంటూ ఈ రోజును జరుపు కుంటున్నారు. భారతీయ సంస్కృతిలో గగనయాన భావన పూర్వం నుంచే ఉంది.రామాయణం లోని పుష్పక విమానం, మహాభారతం లోని దివ్య రథాలు మన పూర్వికుల ఊహా శక్తిని ప్రతిబింబిస్తాయి. శాస్త్రీయ యుగంలో ఆ కలలు వాస్తవ రూపం దాల్చాయి. భారత దేశంలో విమానయాన చరిత్ర 1911 ఫిబ్రవరి 18న అలహాబాద్ నుండి నైనికి పంపిన పోస్టల్ మెయిల్తో ప్రారంభమైంది. ఆ తర్వాత 1932 అక్టోబర్ 15న జె.ఆర్.డి. టాటా తన డీహావిలాండ్ పూసా-38 విమానం నడిపి కరాచీ నుండి మద్రాస్ వరకు పోస్టు, ప్రయాణికులను రవాణా చేయడం ద్వారా భారతీయ పౌర విమానయాన రంగానికి నూతన దారులు తీశారు. ఆయన ప్రారంభించిన టాటా ఎయిర్లైన్స్ తరువాత ఎయిర్ ఇండియాగా మారి దేశ గౌరవానికి ప్రతీకగా నిలిచింది. జె.ఆర్.డి. టాటా అందుకే భారతీయ పౌర విమానయాన పితామహుడిగా



చిరస్థాయిగా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యం తరువాత భారత ప్రభుత్వం 1953లో ఎయిర్లైన్స్ జాతీయీకరణ చేసి ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్, ఇండియన్ ఎయిర్లైన్స్ను ఏర్పాటు చేసింది.1990ల ఆర్థిక స్వేచ్ఛా విధానాల తరువాత ప్రైవేట్ రంగానికి అవకాశం లభించడంతో జెట్ ఎయిర్వేస్, సహారా, కింగ్ఫిషర్, స్పైస్ జెట్, ఇండిగో, విస్తారా వంటి విమానయాన సంస్థలు రంగప్రవేశం చేశాయి. ప్రస్తుతం ఇండిగో సంస్థ 60 శాతం మార్కెట్ వాటాతో భారత గగనంలో అగ్ర స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 148 ఆపరేషనల్ విమానాశ్ర యాలు ఉన్నాయనే గణాంకం ఈ రంగం విస్తృతతను తెలి యజేస్తుంది. ఢిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ విమానాశ్రయం, బెంగళూరు కేమ్పేగౌడ, హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాలు ప్రపంచస్థాయి సౌకర్యాలను కలిగి దేశ గర్వంగా నిలుస్తున్నాయి. 2017లో ప్రారంభమైన ఉడాన్ పథకం ద్వారా చిన్న పట్టణాలు, దూరప్రాంతాలు కూడా గగనతల రవాణాతో అను సంధానమవడం సామాన్య ప్రజలకు విమాన ప్రయాణం అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు 500కి పైగా కొత్త మార్గాలు ప్రారంభమైనట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.రక్షణ రంగంలోనూ విమాన శక్తి భారత భద్రతకు కంచుకోటగా నిలిచింది.

# పాకిస్థాన్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలి మాజీ క్రికెటర్ సంచలన వ్యాఖ్యలు






భారత మాజీ క్రికెటర్ కేదార్ జాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో జరగనున్న మ్యాచ్‌ను బహిష్కరించాలంటూ భారత జట్టుకు ఆయన విజ్ఞప్తి చేశాడు. "భారత జట్టు ఈ మ్యాచ్ ఆడకూడదు. ఇది జరగకూడదనేది నా అభిప్రాయం మాత్రమే కాదు. నేను నమ్ముతున్న విషయం. భారత జట్టు ఎక్కడైనా పాకిస్థాన్‌ను ఓడించగలదు. కానీ, ఈ మ్యాచ్ అసలు జరగకూడదు' అని జాదవ్ పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో అభిమానుల మధ్య చర్చలు జోరుగా సాగుతున్నాయి. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి.. ఆ తర్వాత భారత్ –పాకిస్తాన్ సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో భారత జట్టు పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడకూడదని మాజీ ఆటగాళ్లు, అభిమానులు కలిసి బీసీసీఐకి విజ్ఞప్తి చేస్తున్నారు. కేదార్ జాదవ్‌కు ముందు మాజీ ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ సహా పలువురు మాజీలు ఇదే అభిప్రాయం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.ఈ ఏడాది ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు యూఏఈ వేదికగా జరుగనున్నది. బీసీసీఐ ఈ టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్నది. భారత్ తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న ఆడనున్నది. సెప్టెంబర్ 14న పాకిస్తాన్‌తో హైవోల్టేజ్ మ్యాచ్ జరుగుతుంది. అయితే, ఈ మ్యాచ్‌పై ఇప్పటికీ స్పష్టత లేదు. ఇండియా–పాకిస్థాన్ మధ్య రాజకీయంగా నెలకొన్న ఉద్రిక్తతల దృష్ట్యా, 2027 వరకు ఇరు జట్లు న్యూట్రల్ వేదికలపై మాత్రమే మ్యాచ్‌లు ఆడేందుకు ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలోనే గత మార్చిలో జరిగిన చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం వహించినప్పటికీ, భారత్ తమ మ్యాచ్‌లన్నిటిని దుబాయ్‌లోనే ఆడి, విజేతగా నిలిచింది. ప్రస్తుత పరిస్థితుల్లో బీసీసీఐ ఏ నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.ఒక దేశంగా.. మన దేశ భద్రత, సైనికుల ప్రాణాలు, జాతీయ గౌరవానికి ప్రాముఖ్యత ఇవ్వాల్సిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయిన తరుణంలో ఆ దేశంతో సాధారణ స్థాయిలో క్రీడలు జరుగడం భావోద్వేగపూరితంగా, నైతికంగా సరికాదని పలువురు పేర్కొంటున్నారు. క్రికెట్ వంటి ఆటలు దేశాల మధ్య పాజిటివ్ రిలేషన్స్‌ని పెంచగలవు అనేది వాస్తవమే. కానీ, ఉగ్రవాదానికి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మద్దతు ఇచ్చే దేశంతో సంబంధాలు కొనసాగించడాన్ని ఆటగాళ్లు, అభిమానులు కలిఽసామా న్య ప్రజలతో పాటు మాజీ క్రికెటర్లు సైతం తీవ్రంగా వ్యతిరేకించడంలో అర్థం ఉందని క్రికెట్ పండితులు పేర్కొంటున్నారు. అయితే ఆటగాళ్లకు, ఫ్యాన్స్‌కి ఇది ఒక ప్రతిష్టాత్మక పోరు. కోట్లాది మంది టీవీలకు అతుక్కుపోయి మ్యాచ్‌ని చూస్తుంటారు. క్రికెట్‌ను పూర్తిగా రాజకీయానికి వేరుగా చూడాలన్న వాదనలు ఉన్నాయి. ఉగ్రవాద దాడుల నేపథ్యంలో ఆ దేశంతో మ్యాచులు ఆడకూడదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన ప్రపంచ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లోనూ టీమిండియా మాజీ ఆటగాళ్లతో కూడిన జట్టు పాకిస్తాన్‌తో ఆడేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ దేశంతో మ్యాచ్ ఆడేది లేదని యువరాజ్ సింగ్ నేతృత్వంలోని జట్టు తేల్చిచెప్పింది.

# భారతీయుల కోసం ఓపెన్‌ఏఐ చౌకైన సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ రూ. 399కే 'చాట్‌జీపీటీ గో'




భారతీయ వినియోగదారులకు ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంస్థ ఓపెన్‌ఏఐగుడ్ న్యూస్ చెప్పింది. 'చాట్‌జీపీటీ గో' పేరుతో సరికొత్త, చౌకైన సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను మంగళవారం ప్రకటించింది. కేవలం రూ.399కే ఈ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్లాన్ ద్వారా భారతీయ వినియోగదారులు అధిక వినియోగ పరిమితులు, ఇమేజ్ జనరేషన్, ఫైల్ అప్‌లోడ్స్, ఎక్స్‌టెండెడ్ మెమరీ వంటి ప్రీమియం ఫీచర్లను తక్కువ ధరకే పొందవచ్చు.ఉచిత ప్లాన్‌తో పోలిస్తే 'చాట్ జీపీటీ గో'లో మెసేజ్ లిమిట్, ఇమేజ్ జనరేషన్, ఫైల్ లేదా ఇమేజ్ అప్‌లోడ్‌లు 10 రెట్లు ఎక్కువగా ఉండనున్నాయి. అంతేకాదు, మెమొరీ కూడా ఉచిత ప్లాన్‌తో పోలిస్తే రెండింతలు ఎక్కువగా ఉండనుంది. భారత్‌లో ఓపెన్ ఏఐ టూల్స్‌కు డిమాండ్ దృష్ట్యా.. చాట్‌జీపీటీ గో పేరుతో కొత్త సేవల్ని తీసుకొచ్చినట్లు సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇండిక్ లాంగ్వేజీ సపోర్టుతో పాటూ.. ఈ సబ్‌స్క్రిప్షన్‌కి యూపీఐ ద్వారా చెల్లింపులు చేయొచ్చని సంస్థ తెలిపింది.కాగా, భారత్‌లో ఇప్పటికే పలు ప్లాన్‌లు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. పవర్ యూజర్ల కోసం ఉద్దేశించిన 'చాట్‌జీపీటీ ప్లస్' ప్లాన్ ధర నెలకు రూ. 1,999గా ఉంది. ఇక నిపుణులు, ఎంటర్‌ప్రైజ్‌ల కోసం 'చాట్‌జీపీటీ ప్రో' ప్లాన్‌ను నెలకు రూ. 19,900 రుసుముతో అందిస్తోంది. వాటికి అదనంగా ఈ కొత్త సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ అందుబాటులో ఉండనుంది.

# యాపిల్ కళ్లు చెదిరే డీల్ బెంగళూరు కార్యాలయానికి రూ.1,000 కోట్లు అద్దె



భారత్‌లో ఐఫోన్ల తయారీని భారీగా పెంచడంపై దృష్టి సారించిన దిగ్గజ టెక్ కంపెనీ యాపిల్ సంస్థ.. తయారీ, విక్రయ కార్యకలాపాల్ని వేగంగా విస్తరిస్తోంది. దేశీయంగా ఐఫోన్ ఉత్పత్తిని పెంచనున్నట్లు ఇప్పటికే యాపిల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తాజాగా బెంగళూరు లో ఎంబసీ జెనిత్ భవనంలో 2.7 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని అద్దెకు తీసుకుంది.డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌స్టాక్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ ఎంబసీ గ్రూప్ కు చెందిన కమర్షియల్ ప్రాజెక్టు ఎంబసీ జెనిత్‌లోని ఆ కార్యాలయ స్థలం కోసం 10 ఏళ్ల కాలానికి యాపిల్ సంస్థ డీల్ కుదుర్చుకుంది. 9 అంతస్తుల్లో (5 నుంచి 13వ అంతస్తు వరకు) విస్తరించి ఉన్న ఈ ఆఫీస్ స్పేస్ కోసం యాపిల్ సంస్థ నెలకు రూ.6.3 కోట్ల అద్దె చెల్లించనుంది. ఏడాదికి 4.5 శాతం చొప్పున అద్దె పెంపుతో పార్కింగ్, మెయింటెనెన్స్ చార్జీలతో కలిపిమొత్తం ఈ పదేళ్లలో సంస్థ రూ.1,000 కోట్లను అద్దెగా చెల్లించేందుకు ఒప్పందం చేసుకుంది. 2025 ఏప్రిల్ 3 నుంచి ఈ లీజు అమల్లోకి వచ్చింది. ఈ లీజు ఒప్పందంలో భాగంగా యాపిల్ రూ.31.57 కోట్లు డిపాజిట్ కూడా చేసింది. కాగా, 2024–25 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి అతి పెద్ద మొబైల్ ఫోన్ల ఎగుమతిదారుగా యాపిల్ నిలిచిన విషయం తెలిసిందే. సుమారు రూ.1.5 లక్షల కోట్ల విలువైన ఫోన్లను ఎగుమతి చేసింది.

# భారత చీఫ్‌కోచ్‌గా ధోని



ముంబై : భారత క్రికెట్ జట్టు చీఫ్ కోచ్‌గా మహేంద్రసింగ్ ధోనీ అయితే బాగుంటుందని మాజీ క్రికెటర్ ఆకాశ్‌చోప్రా అభిప్రాయపడ్డాడు. ప్రస్తుత కోచ్ గౌతం గంభీర్ నేతృత్వంలో టీమ్‌ఇండియా మిశ్రమ ఫలితాలు సాధిస్తుందని, ధోనీ కోచ్ అయితే పరిస్థితిలో మార్పు రావచ్చని అన్నాడు. 2021 టీ20 ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియాకు మెంటార్‌గా వ్యవహరించిన ధోనీ.. ఐపీఎల్‌లో చెన్నైకి సారథ్యం వహిస్తున్న కారణంగా కోచింగ్ బాధ్యతలకు దూరంగా ఉంటున్నాడని తెలిపాడు. 'టీమ్‌ఇండియాకు కోచ్‌గా పని చేసేందుకు అతను ఆసక్తితో ఉన్నట్లు అనుకోవడం లేదు. కోచింగ్ అనేది క్లిష్టమైనది. సంవత్సరంలో దాదాపు 10 నెలలు కుటుంబానికి దూరంగా గడపాల్సి ఉంటుంది. అందుకే చాలా మంది క్రికెటర్లు కోచింగ్ వైపు మొగ్గుచూపడం లేదు. దేశ క్రికెట్‌కు ఏమైనా చేయాలనుకుంటే ధోనీ కోచ్‌గా వస్తే బెటర్' అని అన్నాడు.

# రద్దయిన పాలసీల పునరుద్ధరణ

**అక్టోబరు 17 వరకు అవకాశం: ఎల్ఐసీ**




**న్యూఢిల్లీ:** ఏవైనా కారణాలతో ప్రీమియం చెల్లించలేక మధ్యలోనే రద్దయిన పాలసీల పునరుద్ధరణకు భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) గడువు ఇచ్చింది. ఇందుకోసం ఈ నెల 18 నుంచి అక్టోబరు 17 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపడుతోంది. పాలసీ షరతులకు లోబడి ఇంకా పాలసీ గడువు ఉండి, ప్రీమియం చెల్లింపులు ఆపేసిన ఐదేళ్ల లోపు పాలసీలకు మాత్రమే ఈ పునరుద్ధరణ వర్తిస్తుంది. ఇందుకోసం చెల్లించాల్సిన లేటు ఫీజుల్లోనూ రూ.5,000 పరిమితికి లోబడి 30 శాతం వరకు రాయితీ ఇస్తారు. ఇంకా పాలసీ గడువు ఉండి, మధ్యలో ప్రీమియం చెల్లించడం ఆపేసిన అన్ని నాన్–లింక్డ్ బీమా పాలసీలను ఈ గడువులోగా పునరుద్ధరించుకోవచ్చని ఎల్ఐసీ తెలిపింది.

# ఆటే ముఖ్యమని ప్రధానిని కూడా కలవలేదు

**– గవాస్కర్‌పై కర్సన్ ఘావ్రీ ప్రశంస**



**న్యూఢిల్లీ:** మ్యాచ్‌కు ముందు ఓ దేశ ప్రధాని ఆటగాళ్లను కలుసుకునేందుకు వస్తే.. ఎవరైనా ఉద్వేగంతో ఎదురుచూస్తారు. కానీ భారత బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాత్రం తనకు ఆటే ముఖ్యమంటూ మైదానంలోకి వెళ్లాడట. ఈ విషయాన్ని సన్నీ సహచరుడు, మాజీ పేసర్ కర్సన్ ఘావ్రీ వెల్లడించాడు. "ఢిల్లీలో ఆస్ట్రేలియాతో టెస్టు మ్యాచ్‌కు ముందు అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ ఆటగాళ్లను కలుస్తారని సమాచారం వచ్చింది. కానీ ఆయన రావడం ఆలస్యం కాగా అప్పటికే టాస్ పూర్తయి భారత్ బ్యాటింగ్ చేసేందుకు సిద్ధమైంది.గవాస్కర్ ప్యాడ్లు కట్టుకుని సిద్ధంగా ఉన్నాడు. అప్పుడే డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చిన రాజ్‌సింగ్ దుంగార్పూర్ 'ప్రధాని వచ్చారు. మీరందరూ రండి. మూడు నిమిషాల్లో వచ్చేద్దాం' అని చెప్పాడు. అయితే సన్నీ మాత్రం 'మీరెళ్లండి.. నాకు నా బ్యాటింగ్, టీమ్ ముఖ్యం' అని అన్నాడు. బరిలోకి దిగి టీ బ్రేక్ వరకు ఆడాడు. అయితే ఆ రోజు ఆట చివర్లో ప్రధాని స్వయంగా గవాస్కర్‌ను కలుసుకునేందుకు మరోసారి రావడం విశేషం' అని ఘావ్రీ వివరించాడు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



పెట్టుబడిదారులకు కొత్త అవకాశాలు కల్పిస్తూ బంగారం ధర గత కొన్ని రోజులుగా తగ్గుతూనే ఉంది. నిన్నటితో పోలిస్తే నేడు కూడా బంగారం ధరలు మళ్లీ స్వల్పంగా తగ్గాయి. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం దేశంలో 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర రూ.1,01,160గా ఉంది. వెండి ధర మాత్రం స్వల్పంగా పెరిగి రూ.1,17,000కు చేరుకుంది. ఇక 10 గ్రాముల ప్లాటినం ధర రూ.37,850గా ఉంది.దేశంలోని వివిధ నగరాల్లో బంగారం (24కే,22కే,18కే) ధరలు ఇలా..చెన్నై: ?1,01,160బీ ?92,730బీ ?76,680 ముంబయి: ?1,01,160బీ ?92,720బీ ?75,860 ఢిల్లీ: ?1,01,320బీ ?92,890బీ ?76,000 కోల్‌కతా: ?1,01,170బీ ?92,740బీ ?75,880 బెంగళూరు: ?1,01,170బీ ?92,740బీ 75,880హైదరాబాద్: ?1,01,170బీ ?92,740బీ ?75,880కేరళ: ?1,01,170బీ ?92,740బీ 75,880పుణె: 1,01,170 92,74 75,880వడోదరా: ?1,01,220బీ ?92,790బీ 75,920అహ్మదాబాద్: 1,01,220 ?92,790బీ 75,920వివిధ నగరాల్లో వెండి ధరలుచెన్నై: 1,27,100 ముంబయి: 1,17,100ఢిల్లీ: 1,17,100 కోల్‌కతా: 1,17,100బెంగళూరు: 1,17,100 హైదరాబాద్: 1,27,100కేరళ: 1,27,100 పుణె: 1,17,100వడోదరా: 1,17,100 అహ్మదాబాద్: ?1,17,100గత కొన్ని రోజులుగా బంగారం ధరలు తగ్గుతూనే ఉన్నాయి. ముఖ్యంగా బంగారంపై టారిఫ్‌లు ఉండవన్న ప్రకటన ఊరటనిచ్చింది. మరోవైపు, ఆర్బీఐ జోక్యంతో రూపాయి బలపడి బంగారం దిగుమతులు చవకగా మారాయి. దీంతో, దేశీయంగా ధరలు స్వల్పంగా తగ్గాయి. మరికొన్ని రోజుల పాటు ఇదే ట్రెండ్ కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# హెచ్‌సీఏ తాత్కాలిక చీఫ్ దల్జీత్‌పై సీఐడీకి ఫిర్యాదు




హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) తాత్కాలిక అధ్యక్షుడు దల్జీత్ సింగ్, జాయింట్ సెక్రటరీ బసవరాజు, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్‌పై సీఐడీ చీఫ్ చారు సిన్హాకు ఆ సంఘం మాజీ కార్యవర్గ సభ్యుడు చిట్టి శ్రీధర్ ఫిర్యాదు చేశాడు. అమీర్‌పేట సీసీ, ఖాల్సా సీసీ అనే రెండు క్లబ్‌ల తరఫున దల్జీత్ 2018లో సంతకాలు చేసి చెక్‌లు ఇచ్చి, వార్షిక రెన్యువల్ ఫీజును చెల్లించాడని, ఇది మల్టిపుల్ క్లబ్‌ల కిందకు వస్తుందని శ్రీధర్ ఆరోపించాడు. లోధా నిబంధనల ప్రకారం ఒక సభ్యుడు ఒక క్లబ్‌లోనే ఉండాలని, తాత్కాలిక అధ్యక్షుడిగా అతడికి కొనసాగే హక్కు లేదని, తక్షణమే దల్జీత్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.ఇదే ఫిర్యాదును హెచ్‌సీఏ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న రిటైర్డ్ జస్టిస్ నవీన రావు, అంబుడ్స్‌మన్‌కు కూడా ఈమెయిల్ ద్వారా పంపించానని తెలిపారు. బసవరాజు అమీర్‌పేట క్లబ్ నుంచి హెచ్‌సీఏ ఎన్నికల్లో పోటీ చేయడానికి నిబంధనలను ఉల్లంఘించారని, అలాగే సునీల్ అగర్వాల్ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడిగా ఉంటూ అతడి కుమారుడు హెచ్‌సీఏ తరఫున ఆడడం పరస్పర విరుద్ధ ప్రయోజనాల వస్తుందని శ్రీధర్ అన్నాడు.

# తెలుగు సినిమా పెద్ద దిక్కుగా చిరంజీవి పరిశ్రమ సంక్షోభంపై ప్రతినిధులతో చర్చలు



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో గత 15 రోజులుగా నెలకొన్న వేతన వివాదాలు, కార్మికుల పని పరిస్థితులపై అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. పరిశ్రమ సమ్మె దిశగా వెళ్తున్న తరుణంలో, ఆయన తన నివాసంలో 24 క్రాఫ్ట్‌ల ప్రతినిధులతో ఒక అత్యంత కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఫిల్మ్ ఛాంబర్, ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యుల మధ్య ఏర్పడిన ప్రతిష్టంభన నేపథ్యంలో పరిశ్రమ వర్గాలన్నీ చిరంజీవి వైపు చూశాయి. ఈ నేపథ్యంలోనే ఆయన ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం దాదాపు రెండు గంటలకు పైగా కొనసాగింది. కేవలం ఒక సినీ నటుడిగా కాకుండా, పరిశ్రమలో దశాబ్దాల అనుభవం ఉన్న పెద్ద దిక్కుగా ఆయన ఈ చర్చలను ముందుకు నడిపించారు. ప్రతి క్రాఫ్ట్ నుండి వచ్చిన ప్రతినిధులు తమ సమస్యలను, ఆందోళనలను విన్నవించుకోవడానికి చిరంజీవి పూర్తి సమయం ఇచ్చారు. ఈ చర్చల సందర్భంగా, పరిశ్రమ నాయకత్వానికి, కార్మికులకు మధ్య పెరుగుతున్న అంతరం పట్ల చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే, దాని వెన్నెముక అయిన కార్మికులను గౌరవంగా, మర్యాదగా చూడాలి అని ఆయన నొక్కి చెప్పారు. శ్రమకు తగిన వేతనం, మెరుగైన పని పరిస్థితులు కల్పించడం వల్లనే పరిశ్రమ ముందుకు వెళ్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ప్రతినిధులతో విన్న విషయాల ఆధారంగా.. చిరంజీవి నిర్మాతలు, కార్మిక సంఘాల నాయకులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ రెండు వర్గాల మధ్య సయోధ్య కుదిర్చి, సమస్యకు ఒక శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. టాలీవుడ్ క్లిష్ట సమయాల్లో చిరంజీవి లాంటి అగ్ర నటులు ముందుకు రావడం పరిశ్రమకు ఒక పెద్ద భరోసా అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# బిగ్ అప్‌డేట్ రజనీకాంత్, కమల్ హాసన్‌లతో లోకేష్ కనగరాజ్ మల్టీస్టారర్



కూలీ సినిమాతో సూపర్ హిట్‌ని అందుకున్న దర్శకుడు లోకేష్ కనగరాజ్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే నటుడు కార్తీతో ఖైదీ 2 సినిమాను లైన్‌లో పెట్టిన లోకేష్.. ఈ సినిమా కంటే ముందే మరో బిగ్ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించబోతున్నాడని సమాచారం. సూపర్ స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్‌లతో కలిసి కలిసి లోకేష్ ఒక భారీ మల్టీస్టారర్ చేయబోతున్నట్లు కోలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇద్దరు వయసు మళ్లిన గ్యాంగ్‌స్టర్ల కథ అని తెలుస్తుంది. ఇద్దరు లెజెండరీ నటుల ఇమేజ్‌కు తగ్గట్టుగా లోకేష్ కనగరాజ్ ఈ కథను సిద్ధం చేశాడని.. ఈ కథకు ఇద్దరు హీరోలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఈ చిత్రాన్ని కమల్ హాసన్ సొంత నిర్మాణ సంస్థ అయిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్) నిర్మించనుందని సమాచారం. దీనికి సంబంధించి త్వరలోనే ప్రకటన రాబోతుంది.

# నందమూరి కుటుంబంలో విషాదం జయకృష్ణ సతీమణి కన్నుమూత



టాలీవుడ్‌ని వరుస విషాదాలు వెంటడుతున్నాయి. సోమవారం కోట శ్రీనివాసరావు సతీమణి రుక్మిణి కన్నుమూసిందని వార్త నుంచి తేరుకునేలోపు టాలీవుడ్‌కి మరో షాక్ తగిలింది. తాజాగా నందమూరి కుటుంబంలో విషాదం నెలకొంది. దివంగత నటుడు నందమూరి తారక రామారావు పెద్ద కుమారుడు నందమూరి జయకృష్ణ సతీమణి పద్మజ (62) అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. పద్మజ మృతి పట్ల నందమూరి, దగ్గుబాటి కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. ఆమె దగ్గుబాటి వెంకటేశ్వరరావుకు స్వయానా సోదరి. అలాగే, సినీ నటుడు నందమూరి చైతన్య కృష్ణకు తల్లి. ఈ విషాద వార్త తెలిసిన వెంటనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. కాగా.. పద్మజ అంత్యక్రియలు హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించనున్నారు


# వరుసగా పరాజయాలే



కియారా అద్వానీ హిందీలోనే కాదు తెలుగులోనూ సినిమాలు చేస్తూ తన సత్తా చాటుతోంది. ఈ యేడాది 'టాక్సిక్' మూవీతో శాండిల్ ఉడ్ లోకి కూడా అడుగుపెడుతోంది. కేవలం గ్లామర్ డాల్ గా కాకుండా వైవిధ్యమైన పాత్రలు చేస్తున్న కియారా అద్వానీ కెరీర్ లో 'వార్ -2'కు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఈ సినిమాలో కియారా అద్భుతమైన యాక్షన్ సీన్స్ చేసింది. అయితే వాటి గురించి కాకుండా కేవలం ఆమె ధరించిన బికినీ గురించి మాత్రమే సోషల్ మీడియాలో అత్యధికంగా చర్చ జరిగింది. అయితే ఈ సినిమా పరాజయం పాలు కావడంతో కియారా అద్వానీ ఖాతాలో వరుసగా ఐదు చిత్రం చేరినట్టు అయ్యింది. కియారా అద్వానీ కెరీర్ మొదలై పదకొండు సంవత్సరాలు అవుతోంది. యేడాది రెండు, మూడు సినిమాల్లో నటిస్తోంది. తెలుగులోనూ 'భరత్ అనే నేను', 'వినయ విధేయ రామ' చిత్రాలలో నటించింది. తాజాగా ఈ యేడాది ఆమె నటించిన 'గేమ్ ఛేంజర్' కూడా విడుదలైంది. చివరి రెండు సినిమాలు పరాజయం పాలయ్యాయి. అయితే... 2022లో వచ్చిన 'భోల్ భులయ్యా -2' తర్వాత కియారా అద్వానీకి చెప్పుకోదగ్గ సక్సెస్ దక్కలేదు. అదే యేడాది వచ్చిన 'జుగ్ జుగ్ జియో' 'గోవింద నామ్ మేరా' సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ఇక 2023లో వచ్చిన 'సత్యప్రేమ్ కి కథ' కూడా ఆశించిన స్థాయిలో ఆడలేదు. 2024లో అయితే కియారా నటించిన ఒక్క సినిమా కూడా విడుదల కాలేదు. ఈ యేడాది ఇప్పటికే 'గేమ్ ఛేంజర్' ఫ్లాప్ కాగా... తాజాగా 'వార్ 2' -2) కూడా అదే ఖాతాలో చేరింది. దాంతో కియారా వరుసగా ఐదు ఫ్లాప్స్ అందుకుని డబుల్ హ్యాట్రిక్ కు చేరువైందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. మరి త్వరలో విడుదల కానున్న యశ్ మూవీ 'టాక్సిక్' అయినా విజయం సాధించి, ఈ అందాల ముద్దుగుమ్మను సక్సెస్ ట్రాక్ ఎక్కిస్తుందేమో చూడాలి. కియారా అద్వానీ జీవితంలో ఈ మధ్య కాలంలో జరిగిన ఆనందకర సంఘటన ఏదైనా ఉందంటే జూలై 15న ఆమె అందాల బిడ్డకు జన్మనివ్వడమే!


## రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్' మూవీ సెట్లో ఫుడ్ పాయిజన్

# ఆసుపత్రి పాలైన 120 మంది




బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న ధురంధర్ మూవీ సెట్స్‌లో అపశృతి చోటుచేసుకుంది. కలుషిత ఆహారం తిని దాదాపు 120 మందికి పైగా సినీ కార్మికులు అస్వస్థత గురయ్యారు. దీంతో వీరిని ఆసుపత్రికి తరలించగా.. కార్మికులందరి ఆరోగ్యం స్థిరంగా ఉన్నట్లు అధికారులు చెప్పారు. ధురంధర్ మూవీ షూటింగ్ కోసం వీరందరూ లేహ్‌కి వచ్చినట్లు తెలుస్తుంది. ఇక ఈ ఘటన జరిగిన ప్రదేశం నుంచి ఆహార శ్యాంపిల్లను విశ్లేషణ కోసం సేకరించారు. ఫుడ్ పాయిజనింగ్ జరిగినట్లు ఆస్పత్రి డాక్టర్లు చెబుతున్నారు . రణ్‌వీర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ధురంధర్'. ఈ సినిమాకు నేషనల్ అవార్డు విన్నర్ ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తున్నాడు. 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తున్న రెండవ చిత్రం ఇది. ఫుడ్ పాయిజనింగ్ జరిగినట్లు ఆస్పత్రి డాక్టర్లు ఈ చిత్రం 2025 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుండగా.. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది.

# 'హరిహర వీరమల్లు' కోసం ప్రభుత్వ నిధులు



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై మాజీ ఐఏఎస్ అధికారి ఎస్. విజయ్ కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పవన్ కళ్యాణ్ ఇటీవల నటించి ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'హరిహర వీరమల్లు' సినిమా ప్రమోషన్ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిధులను వాడుకుని దుర్వినియోగం చేశారని ఆయన తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ ఆరోపణలపై సీబీఐతో విచారణ జరిపించాలని ఎస్. విజయ్ కుమార్ హైకోర్టుని కోరారు. అయితే విజయ్ కుమార్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. కేసు విచారణ జాబితాలో సీబీఐ, ఏసీబీ న్యాయవాదుల పేర్లను చేర్చాల్సిందిగా రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఈ కేసు తదుపరి విచారణను హైకోర్టు వారం రోజుల పాటు వాయిదా వేసింది.

## వరుసగా అవకాశాలు అందుకుంటున్న కుర్రభామ

# శివాని నాగరం లేటెస్ట్ పిక్స్



టాలీవుడ్ లో కొత్త అందాలు ప్రేక్షకులను కవ్విస్తున్నాయి. ఈ క్రమంలోనే శివాని నాగరం అనే ముద్దుగుమ్మ వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఈ అమ్మడు కేవలం నటి మాత్రమే కాదు గాయని , కూచిపూడి నృత్యకారిణి కూడా.. ఈ ముద్దుగుమ్మ 2024లో విడుదలైన "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టింది. అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్రంలో ఆమె సుహాస్ సరసన లక్ష్మి పాత్రలో నటించి, తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. శివాని ఈ అవకాశాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వచ్చిన ఆడిషన్ మెసేజ్ ద్వారా పొందింది, మొదట హీరోయిన్ స్నేహితురాలి పాత్ర కోసం వెళ్లి, తర్వాత హీరోయిన్‌గా ఎంపికైంది. ఆమె ప్రస్తుతం "లిటిల్ హార్ట్స్" అనే సినిమాలో నటిస్తోంది. అంతేకాకుండా, శివాని గాయనిగా కూడా తన ప్రతిభను చూపించింది, "ఆరంభం" అనే సినిమాలో "అమాయకంగా" అనే పాటను ఆలపించింది, ఇది ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందింది. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ.. తన ఫోటోలతో అభిమానులను ఆకర్షిస్తోంది. ఆమె తన సహజమైన అందం, నటనా నైపుణ్యంతో యువతలో మంచి క్రేజ్ సొంతం చేసుకుంటుంది. శివాని హైదరాబాద్‌కు చెందిన తెలుగు అమ్మాయి. తెలుగు నటీమణులకు సినిమా రంగంలో మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటుంది ఈ భామ. ఆమె కూచిపూడి నృత్యంలో శిక్షణ పొంది, పిల్లలకు సంగీతం నేర్పిస్తుంది. భవిష్యత్తులో కథలో కీలకమైన, ప్రతిభను చాటే పాత్రలను చేయాలని ఆమె ఆసక్తి చూపిస్తోంది. ప్రస్తుతం సుహాస్ సరసన హే భగవాన్ అనే సినిమాలో నటిస్తుంది. సోషల్ మీడియాలో ఈ చిన్నదాని ఫోటోలు ఆకట్టుకుంటున్నాయి.

Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794